PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 86 | విజయవాడ, సోమవారం 28 అక్టోబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 28 October 2024 | Rs

రూ.3 లక్షల కోట్లకు పైనే..

- బడ్జెట్‌కు కసరత్తు వేగవంతం
- నవంబర్ 15 తరువాత అసెంబ్లీ

3

డబ్ల్యుటిసి ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం

- న్యూజిలాండ్ చేతిలో ఓటమితో ఇబ్బందుల్లో భారత్

6





హెచ్‌సియులో ఎస్ఎఫ్ఐ కూటమి

ఘనవిజయం

విద్యార్థి సంఘ ఎన్నికల్లో మట్టికరిచిన మతోన్మాద శక్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు) విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వామపక్ష, సామాజిక శక్తుల కూటమి (ఎస్ఎఫ్ఐ, ఎఎస్ఎ, బిఎస్ఎఫ్, డిఎస్‌యు) మరోసారి ఘన విజయం సాధించింది. ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థులు కీలక పోస్టులను కైవసం చేసుకున్నారు. మతతత్వానికి వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ఈ విజయం ఒక ప్రతీక అని ఎస్ఎఫ్ఐ నాయకత్వం పేర్కొంది. ఈ నెల 25న ఎన్నికలు జరగ్గా 26న రాత్రి ఫలితాలు వెల్లడయ్యాయి. అధ్యక్షునిగా ఎ.ఉమేష్ అంబేద్కర్ తన ప్రత్యర్థి ఎబివిపి అభ్యర్థి ఆకాశ్ బాటిపై 26 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి పోస్టుకు పోటీ చేసిన నిహాద్ సులేమని (ఎస్ఎఫ్ఐ) తన ప్రత్యర్థి యశస్వి (ఎబివిపి)పై 207 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఉపాధ్యక్ష పోస్టుకు పోటీ చేసిన ఆకాశ్ కుమార్ తన ప్రత్యర్థి పవన (ఎబివిపి)పై 213 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సంయుక్త కార్యదర్శిగా ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి త్రివేణి తన ప్రత్యర్థి ముషాద్ అహ్మద్‌పై 451 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. సాంస్కృతిక కార్యదర్శిగా ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి కెవి.కృష్ణమూర్తి తన ప్రత్యర్థి సోనియా దాస్‌పై 179 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. క్రీడల కార్యదర్శిగా అబ్దుర్ రెహమాన్ (ఎస్ఎఫ్ఐ) విజయం సాధించారు. జిఎస్ క్యాస్ (ఇంటిగ్రేడెడ్) కేటగిరిలో కృషి ప్రేరణ, జిఎస్ క్యాస్ (పిజి) కేటగిరిలో శృతికీర్తి, జిఎస్ క్యాష్ (పరిశోధన) కేటగిరిలో భవితశ్రీ విజయం సాధించారు. వీరంతా ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థులే. హెచ్‌సియు విద్యార్థి సంఘం ఎన్నికల్లో మతోన్మాద ఎబివిపిని ఓడించి ఎస్ఎఫ్ఐ నేతృత్వంలోని వామపక్ష, సామాజిక శక్తులకు ఘనవిజయం కట్టబెట్టిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ అభినందించింది. 5 వేల మందికిపైగా విద్యార్థులు అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలతో సహా ఆరు ప్రధాన పోస్టులకు అభ్యర్థులను ఎన్నుకున్నారు.

సహకారంపై

కేంద్రం పట్టు బిగింపు

ఐదేళ్లల్లో మల్టీపర్పస్ పిఎసిఎస్‌లు, మత్స్య, పాల సొసైటీలు

- 25 రకాల వ్యాపారాలు చేసే కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్పు
- నష్టాలు, ఖాయిలా పేరిట ఉన్న వాటి మూత
- ప్లాన్ అమలుకు జిల్లాల్లో జాయింట్ వర్కింగ్ కమిటీలు
- రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు
- గత ప్రభుత్వంలోనే అంకురార్పణ



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాజ్యాంగానికి, సమాఖ్య స్ఫూర్తికి గండి కొడుతూ కేంద్రం తన చెంత కొత్తగా నెలకొల్పిన సహకార మంత్రిత్వశాఖ రాష్ట్రంలోని సహకార వ్యవస్థను తన గుప్పెట్లోకి తెచ్చుకునేందుకు పథకం వేసింది. దానికి మోడీ సర్కార్ 'సహకార్ సే సమృద్ధి' అని ముద్దుపేరు పెట్టింది. అందులో భాగంగా రానున్న ఐదేళ్లల్లో వ్యవసాయ, పాల, మత్స్య బహుళ ప్రయోజన సహకార సంఘాల (మల్టీపర్పస్ కోఆపరేటివ్స్)ను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు పక్కా ప్రణాళిక ఇచ్చింది. ఎప్పటికి ఎన్ని సంఘాలు ఏర్పాటు చేయాలో లక్ష్యాలు నిర్దేశించింది. సెప్టెంబర్ 19న కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసి, వాటిని తూచ తప్పకుండా పాటించాలని రాష్ట్రాలను కోరారు. తమ ప్లాన్ అమలు కోసం జిల్లాల స్థాయిలో జాయింట్ వర్కింగ్ కమిటీ (జెడబ్ల్యుసి)లను నెలకొల్పాలని ఆదేశించారు. ఆ మేరకు కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను కోరుతూ ఎపి ప్రభుత్వం శుక్రవారం జిఒఆర్‌టి నెం.670 విడుదల చేసింది. గత వైసిపి ప్రభుత్వం కేంద్రం సహకార ప్లాన్ అమలు కోసం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ నిరుడు ఆగస్టు 15న జిఒనెం.443 విడుదల చేసిందని ప్రస్తుత ఉత్తర్వుల్లో ఉటంకించింది. జిల్లా కమిటీలకు ఉప కమిటీలుగా పని చేసే వర్కింగ్ కమిటీలలో సహకార, ఫిషరీస్, డెయిరీ తదితర శాఖల అధికారులుంటారు. ఈ కమిటీలకు జాయింట్ కలెక్టర్లు లేక ఆ హోదా కలిగిన అధికారులు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించాలి. త్వరలో వర్కింగ్ కమిటీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా కేంద్రం ఇచ్చిన ప్లాన్‌ను అమలు చేయాలని తాజా జిఒలో రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది.

బిజినెస్ సెంటర్లు

ఇప్పటి వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్), పాల సొసైటీలు, మత్స్య సహకార సంఘాలు నిర్దిష్టంగా తమ తమ సభ్యుల అవసరాల మేరకు సేవలందిస్తూ వచ్చాయి. ఇక నుంచి ప్రతి సహకార సొసైటీ 25 రకాల సేవలు అందించేలా మోడల్ బైలాస్ రూపొందించామని కేంద్రం పేర్కొంది. పెట్రోలు, డీజిల్ బంక్‌లు, మెడికల్ షాపులు, బ్యాంక్ సేవలు, పిఎం కిసాన్ కేంద్రాలు, ఆహార ధాన్యాల సేకరణ, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకాలు, స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు... ఇలా పలు రకాల వ్యాపారాలనూ అనుమతించనున్నారు. కామన్ సర్వీస్ సెంటర్లుగా సొసైటీలను మారుస్తారు.

ఐదేళ్లకు పకడ్బందీ ప్రణాళిక

రాష్ట్రంలో ప్రస్తుతం 2,046 పిఎసిఎస్‌లుండగా రెండు దశల్లో ఏడాదికి కొన్ని చొప్పున నష్టాల్లో, సేవలు నిలిపేసిన సొసైటీలను గుర్తించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తారు. సామర్థ్యం పెంపు, ఆర్థిక తోడ్పాటు, అభివృద్ధి, బలోపేతం, ఆర్థిక పరిపుష్టి అని పేరు పెట్టారు. కొన్నింటిని కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. అన్నీ కలుపుకొని మొత్తం 2,150 మల్టీపర్పస్ సొసైటీలుగా రూపాంతరం చెందుతాయి. వీటిలో కన్సల్టెట్లు, సిఇఒల వంటి పదవులు సృష్టిస్తారు. ఇదే తరహాలో 7,820 డెయిరీ కోఆపరేటివ్స్‌ను, 200 మత్స్యసహకార సొసైటీలను బహుళ ప్రయోజన సహకార సంఘాలుగా మారుస్తారు. నాబార్డు, ఎన్‌డిడిబి, ఎన్ఎఫ్‌డిసి, రాష్ట్ర ప్రభుత్వం కలిసి కేంద్రం నిర్దేశించిన గడువు లోపు మల్టీపర్పస్ సొసైటీలను ఏర్పాటు చేయాలి. లక్ష్యాలు సాధించాలి.

సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో

ఎర్ర జెండాలు పాతిన కార్మికులు

- గుడిసెల ఏర్పాటు
- భూములైనా ఇవ్వాలని, కోర్టు తీర్పుల ప్రకారం నష్టపరిహారమైనా చెల్లించాలని డిమాండ్
- ముఖ్యమంత్రి స్పందించి సమస్య పరిష్కరించాలి : సిహెచ్ బాబూరావు
- 20 మందిపై పోలీసుల అక్రమ కేసులు



మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)

కోర్టుల తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలు యాజమాన్యం వెంటనే చెల్లించాలని, లేదా సిమెంట్ ఫ్యాక్టరీ భూములు తమకు అప్పగించాలని కోరుతూ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఎసిసి కృష్ణా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఆదివారం పెద్ద ఎత్తున ఉద్యమించారు. సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో జెండాలు పాతి ఆక్రమించుకున్నారు. వందలాదిమంది కార్మికులు, వారి కుటుంబసభ్యులు పిల్లాపాపలతో సహా యూనియన్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా వచ్చారు. ఈ భూముల్లోకి చేరుకొని జెండాలు పాతి తమ వెంట తెచ్చుకున్న బొంగులతో గుడిసెలు వేసుకున్నారు. కోర్టు తీర్పుల ప్రకారం యాజమాన్యం తమకు నష్టపరిహారం ఇవ్వాలని, లేదా తమకు రావలసిన డబ్బులకు తగిన భూమైనా ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అఖిలపక్షం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు సహా మొత్తం 20 మంది పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి ముందు కూరపాటి స్టీవెన్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు మాట్లాడుతూ 1993 మే 29న ఈ సిమెంట్ లాకౌట్ అయిందని గుర్తు చేశారు. కార్మికులకు ఎటువంటి నష్టపరిహారమూ చెల్లించ లేదని తెలిపారు. దీంతో, కార్మికులు కోర్టులను ఆశ్రయించారన్నారు. కార్మికులకు వడ్డీతో మిగతా 7లో

టెక్స్‌టైల్ ఫ్యాక్టరీలో ప్రమాదం

- విషవాయువు పీల్చి ఇద్దరు మృతి
- మరో ఏడుగురికి అస్వస్థత



కార్మికుల మృతితో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్ వస్త్ర పరిశ్రమలో విషవాయువులు లీక్ కావడంతో ఇద్దరు కార్మికులు మరణించారు. మరో ఏడుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అహ్మదాబాద్‌లోని నారోల్ పారిశ్రామిక ప్రాంతంలోని దేవి సింథటిక్స్‌లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రింటింగ్, డైయింగ్ యూనిట్‌లో ఉపయోగించిన యాసిడ్‌ను ట్యాంక్‌లోకి పంపిస్తున్నప్పుడు అక్కడ పనిచేస్తున్న తొమ్మిది మంది కార్మికులు విష వాయువుల ప్రభావంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రవిమోహన్ సైనీ తెలిపారు. అస్వస్థతకు గురైన వారిని ఎల్‌జి ఆసుపత్రికి తరలించారని, అక్కడ ఇద్దరు మరణించారని చెప్పారు. ఏడుగురు కార్మికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. పోలీసులు, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ, గుజరాత్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సిబ్బందితో సహా ఒక బృందం సంఘటనా స్థలానికి చేరుకుని, ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేస్తోందని వివరించారు.

ఆన్‌లైన్ స్కామ్‌లపై అవగాహన అవసరం

- మన్ కీ బాత్‌లో మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆన్‌లైన్ స్కామ్‌లపై ప్రజలకు అవగాహన అవసరమని ప్రధాని నరేంద్ర మోడీ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన 'మన్ కీ బాత్' 115వ ఎపిసోడ్‌లో ప్రసంగించారు. దీపావళి పండగకు ముందు గానే శుభాకాంక్షలు తెలిపారు. డిజిటల్ మోసాలపై ఆందోళన వద్దని, ఇలాంటి సందర్భం ఎదురైతే కాసేపు ఆగి, ఆలోచించా లని ప్రధాని సూచించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు దర్యాప్తు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పనిచేస్తున్నాయ న్నారు. డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నేరగాళ్ల నుంచి కాల్స్ వస్తే 1930 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. యానిమేషన్, గేమింగ్ పరిశ్రమలపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రతి రంగంలోనూ అద్భుతాలు సృష్టిస్తోందని అన్నారు. 'యువత మన సంస్కృతికి అద్దం పట్టే కంటెంట్‌ను రూపొందిస్తోంది. అక్టోబరు 28న 'వరల్డ్ యానిమేషన్ డే' జరుపుకోనున్నాం. ఇండియా గ్లోబల్ యానిమేషన్ పవర్ హౌస్‌గా మార్చేందుకు సంకల్పించాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు.



జెండా ఊపి విమాన సర్వీసులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో ఎంపీలు శివనాథ్,బాబూరావు

ప్రజలకు మరింత చేరువగా విమాన సేవలు

- భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్ సర్వీసెస్ యూనివర్సిటీ
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- విశాఖ-విజయవాడ మధ్య ఎయిరిండియా, ఇండిగో సర్వీసులు ప్రారంభం


ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ-విజయవాడ మధ్య రెండు కొత్త విమాన సర్వీసుల ప్రారంభంతో ప్రజలకు విమాన సేవలు మరింత చేరువ కానున్నాయని, వ్యాపార, టూరిజం అభివృద్ధికి ఈ సర్వీసులు తోడ్పడతాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం విశాఖపట్నం-విజయవాడ మధ్య రెండు కొత్త విమాన సర్వీసులను ఎంపి కేశినేని శివనాథ్‌తో కలిసి రన్ వేపై ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అందులో ఒకటి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసు కాగా, మరొకటి ఇండిగో సర్వీసు. తొలుత ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు రామ్మోహన్ నాయుడు, శివనాథ్... బోర్డింగ్ పాస్‌లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ భోగాపురంలో అంతర్జాతీయ స్థాయి ఎయిర్ సర్వీసెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. 500 ఎకరాల్లో ఏవియేషన్ సర్వీసులు, సౌకర్యాల కోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. విశాఖ నుంచి ఎయిర్ కనెక్టివిటీ విస్తరణకు కృషి మిగతా 7లో

ట్రంప్‌కు ఓటు.. మహిళలకు చేటు

- మిచెలీ ఒబామా

మిచిగాన్: మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఓటేస్తే, మహిళలకు వ్యతిరేకంగా ఓటేసినట్లేనని మిచిగాన్‌లోని పురుష ఓటర్లనుద్దేశించి మిచెలీ ఒబామా అన్నారు. అబార్షన్, ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్)కు సంబంధించిన చట్టాలను ట్రంప్ అధికారం లోకి వస్తే మరింత కఠినతరం చేస్తారని, ఆయన స్త్రీ వ్యతిరేకి అని మిచెలీ ఒబామా విమర్శించారు. పునరుత్పత్తి సమయంలో మహిళలు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటారని, ప్రసవ సమయంలో రక్త స్రావమైతే అది స్త్రీ మరణానికి దారి తీస్తుంది. గుర్తించబడని గర్భాశయ కేన్సర్‌తో బాధపడుతున్న వారి పరిస్థితి గురించి వేరే చెప్పనక్కర్లేదు. అబార్షన్ అనేది స్త్రీల హక్కు, దీనికి ట్రంప్ వ్యతిరేకి కాబట్టి ఆయనను ఓడించాలని మిచెల్ ఒబామా పిలుపునిచ్చారు.. శనివారం మిచిగాన్‌లోని కలమజూలోని వింగ్స్ ఈవెంట్ సెంటర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో హారిస్‌తో కలిసి పాల్గొన్న ఈ మాజీ అమెరికన్ ప్రథమ మహిళ ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు. వైట్ హౌస్‌కి డెమొక్రాటిక్ అభ్యర్థి హారిస్‌ను పంపాలని ఆమె పిలుపునిచ్చారు.



సభలో మాట్లాడుతున్న విజయ్.. అశేషంగా తరలి వచ్చిన అభిమానులు

లౌకికవాదం, సామాజిక న్యాయమే మా సిద్ధాంతం

- తొలి సభలో సినీ హీరో విజయ్

7

అందరికీ ఆరోగ్యంలో కేరళకు తొలిస్థానం

ప్రజారోగ్యం రూపురేఖలు మార్చుచేశాం : సిఎం విజయన్

7

బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు అవసరం

3

6న మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నవంబరు 6న ఉదయం 11 గంటలకు సిఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. ఈ మేరకు సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ భేటీ నేపథ్యంలో సంబంధిత హెచ్‌ఒడిలు నవంబరు 4వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రతిపాదనలు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈసారి జరగనున్న కేబినెట్‌లో అసెంబ్లీ సమావేశాలకు సంబంధించి తేదీలు ఖరారుతోపాటు పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ దీపావళి కానుకగా ఛార్జీల మోత : వైసిపి విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీలు పెంచడమే కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇస్తున్న దీపావళి కానుక అని వైసిపి పేర్కొంది. విద్యుత్ ఛార్జీల పెంపుపై 'ఎక్స్' వేదికగా ఆదివారం స్పందించింది. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, అవసరమైతే 30 శాతం తగ్గిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించింది. ప్రజలు ఛార్జీలు పెంచొద్దని వేడుకున్నా రూ.6,072.86 కోట్లు భారం వేయడమే సిఎం చంద్రబాబు విజన్ అని పేర్కొంది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బాబు విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేశారని, అనవసర విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కారణంగా డిస్కమ్‌లు అప్పుల పాలయ్యాయని తెలిపింది. దాదాపు 8 వేల మెగా వాట్ల విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాల వల్ల విద్యుత్ సంస్థలపై 25 ఏళ్లపాటు ఏటా రూ.3,500 కోట్లు అదనపు భారం పడుతోందని వెల్లడించింది. పెంచిన విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేసింది.

రూ.లక్షల కోట్లు ఎలా సంపాదించావు?

- జగన్‌కు కొమ్మారెడ్డి ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.లక్షల కోట్లు సంపాదించారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2003లో రూ.9 లక్షలు ఆదాయపు పన్ను కట్టిన జగన్ ఇంతలోనే ఇన్ని రూ.లక్షల కోట్లు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. తండ్రి అధికారం, తన అధికారం అడ్డుపెట్టుకొని ప్రజా సంపదను దోచుకున్నదే కాని సక్రమ సంపాదన కాదని విమర్శించారు. వైసిపి నాయకులు విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి.. జగన్ ముఠాలో తోడుదొంగలని ఆరోపించారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు తన సోదరీమణులకు తండ్రి ఆస్తితోపాటు తన కష్టార్జితాన్ని కూడా ఇచ్చారని చిత్తూరు జిల్లా ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. సొంత తల్లి, చెల్లితో జగన్ కంటనీరు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఎర్రన్నాయుడు గురించి నోరుజారితే సహించేది లేదని విజయసాయిరెడ్డిని హెచ్చరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

జగన్‌కు బాబు పిచ్చి వీడలేదు

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ సిఎం జగన్‌కు ఇంకా చంద్రబాబు పిచ్చి వీడలేదని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఇప్పటికీ అద్దంలో చూసుకున్నా ఆయనకు చంద్రబాబే కనిపిస్తున్నట్లుందని పేర్కొన్నారు. వైసిపి నాయకులు విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా ఆమె ఆదివారం స్పందించారు. వైఎస్‌ఆర్ మరణానికి చంద్రబాబు కారణమైతే మీరు ఐదేళ్లు అధికారంలో ఉండి గాడిదలు కాశారా? అంటూ ప్రశ్నించారు. దర్యాప్తు చేసి నిజానిజాలు ఎందుకు బయటపెట్టలేదన్నారు. దోషులను ఎందుకు శిక్షించలేదన్నారు. చంద్రబాబుతో నాకు ఎటువంటి వ్యక్తిగత సంబంధాలు లేవని, ప్రతిపక్ష నేతగా బాబును నా బిడ్డ పెళ్లికి పిలిస్తే... నా చీర గురించి కూడా విపరీత అర్థాలు తీసిన మీలాంటి వాళ్లకు సభ్యతా సంస్కారం ఉందని ఎలా అనుకోవాలన్నారు. చంద్రబాబు కళ్లల్లో ఆనందం చూడటానికో, ఆయనను మెప్పించడానికో పని చేయాల్సిన అవసరం తనకు ఎప్పటికీ రాదని మాటిస్తున్నానని తెలిపారు. విజయసాయిరెడ్డి చదివిన స్క్రిప్ట్ అంతా జగన్ ది కాదని, ఆస్తుల గురించి నలుగురు చిన్న బిడ్డలకు సమాన వాటా ఉంటుందన్న వైఎస్‌ఆర్ మ్యాండేట్ అబద్ధమని ఆయన బిడ్డలపై ప్రమాణం చేయగలరా? అని ప్రశ్నించారు. ఆయన జగన్ మోచేతి నీళ్లు తాగిన వ్యక్తేనని, రాజకీయంగా, ఆర్థికంగా జగన్ వల్ల బలపడిన వ్యక్తేనన్నారు. పొన్నవోలు, జగన్ కలిసి వైఎస్‌ఆర్ మరణం తరువాత ఛార్జిషీట్‌లో ఆయన పేరు చేర్చారని, అందుకే పొన్నవోలుకు అడ్వకేట్ జనరల్ పదవి దక్కిందన్నారు. ఇప్పుడు మళ్లీ తన స్వప్రయోజనాల కోసం తల్లిని కోర్టుకు ఈడ్చిన విషపు నాగు జగన్ అని విమర్శించారు.

'ఉచిత గ్యాస్' కు ఇకెవైసి కష్టాలు

- రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షలమందిపైనే
- మొరాయిస్తున్న సర్వర్లు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దీపావళి నుండి అమలులోకి రానున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇకెవైసి ని తప్పని సరి చేయడంతో ప్రజానీకానికి కష్టాలు ప్రారంభమైనాయి. ఇకెవైసికి దూరంగా నేటికీ 20లక్షల వినియోగదారులు : రాష్ట్ర వ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డుదారులు 1.47లక్షల మంది ఉండగా అందులో నేటికీ సుమారు 20లక్షలకు పైగా గ్యాస్ ఏజెన్సీల వద్ద ఇకెవైసి చేసుకోలేదని సమాచారం. ఇకెవైసి కాని పక్షంలో గ్యాస్ కంపెనీల వద్ద నుండే డేటా, ప్రభుత్వం వద్ద ఉండే డేటా సరిపోయే అవకాశాలు లేవు. దీంతో ఫలితంగా తెల్లకార్డు ఉన్నప్పటికీ ఉచిత గ్యాస్ పొందే అవకాశం ఆయా వినియోగదారులు కోల్పోయే ప్రమాదముంది. దీంతో పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఇకెవైసి నమోదు కోసం గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెడుతున్నారు. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నాడు సర్వర్లు మొరాయించాయి, గంటల తరబడి ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో వివిధ ప్రాంతాల్లో ప్రజానీకం వెనుతిరిగినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు ఇకెవైసి కోసం గ్యాస్ పాయింట్ల వద్దకు వస్తున్న వినియోగదారులను గ్యాస్ రెగ్యులేటర్స్, సురక్ష పైప్‌ను కూడా మార్చుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. ఇకెవైసికి , రెగ్యులేటర్ మార్పుకు సంబంధం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1100 డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీల ద్వారా 1.55కోట్ల మంది వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతుండగా, తెల్లరంగు రేషన్ కార్డులు 1.47కోట్లు మాత్రమే ఉన్నాయి. తెల్ల రేషన్ కార్డు లేని వారిలో కూడా పలువురు పేదలు ఉన్నప్పటికీ వారు 'ఉచిత' పథకానికి అనర్హులుగా మారారు. ఉమ్మడికుటుంబాలు విడిపోయిన వారు, నూతనంగా వివాహాలైన వారు కొత్త రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు 64వేలకు పైగా దరఖాస్తులు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నాయి.



ముఖ్యమంత్రితో 'త్రిఎఫ్' ఎమ్‌డి భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును త్రిఎఫ్ ఆయిల్‌పామ్ ఎమ్‌డి గోయెంకా, డైరెక్టర్ ఆశిష్ గోయెంకా కలిశారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ఆదివారం కలిసి వరద బాధితుల కోసం రూ.కోటి విరాళంగా అందించారు. పామాయిల్ శుద్ధి రంగంలో త్రిఎఫ్ ఆయిల్ సంస్థ అగ్రగామిగా ఉందని సిఎం చంద్రబాబు సామాజిక మాధ్యమంలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ సౌకర్యంతో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, తద్వారా రాష్ట్రంలో వ్యాపార ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు.

ఎపిటిడిసి ఎమ్‌డిగా ఆమ్రపాలి

తెలంగాణ నుంచి ఇటీవల రిలీవ్ అయి ఎపి కేడర్‌కు వచ్చిన ఐఎఎస్ అధికారులకు ప్రభుత్వం పోస్టింగులిచ్చింది. ఈ మేరకు సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డిగా ఆమ్రపాలి నియమితులయ్యారు. ఎపి టూరిజం అథారిటీ సిఇఒగానూ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. వైద్యారోగ్యశాఖ కమిషనరుగా వాకాటి కరుణ, సాధారణ పరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శిగా వాణీమోహన్, కార్మికశాఖ ముఖ్య కార్యదర్శిగా వాణీప్రసాద్‌ను నియమించారు. మరో ఐఎఎస్ రొనాల్డ్ రోస్‌కు ఇంకా పోస్టింగు ఇవ్వలేదు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

- డిప్యూటీ సిఎం పవన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి పథకంలో చేపట్టే పనుల్లో ప్రతి దశలోనూ నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టరు కృష్ణతేజ, ఇతర అధికారులతో ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఈ అంశంపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నుంచి విడుదలైనందున వీటిని సక్రమంగా, పారదర్శకంగా వినియోగించాలన్నారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో 3 వేల కిలోమీటర్ల సిసి రోడ్లు, 500 కిలోమీటర్ల బిటి రోడ్లు, 22,525 గోకులాలు, 25 వేల ఫాం పాండ్లు, 30 వేల ఎకరాల్లో నీటి సంరక్షణ కందకాలకు సంబంధించిన పనులు 'పల్లె పండగ' కార్యక్రమంలో చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అధికారులు వివరించారు. ఈ పనులు రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారమే ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. చేపట్టిన పనులు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలన్నారు. పనులు ఏ దశలో ఉన్నాయనే విషయం ప్రజలకు తెలిస్తేనే పారదర్శకత వస్తుందని చెప్పారు. అంతేకాకుండా సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులతో కూడా ఏ పంచాయతీకి ఎన్ని నిధులు విడుదలయ్యాయి, వాటితో చేపడుతున్న పనులు ఏమిటనేది ప్రజలకు వివరించే ప్రక్రియ మరింత సమర్ధవంతంగా చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి గ్రామ సభల నిర్వాహణ, 'పల్లె పండగ'తో అభివృద్ధి పనులు ప్రారంభించడం వల్ల జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని, అదే సమయంలో చేపట్టిన పనులను సైతం నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయడం వల్ల అందరికీ ఆదర్శంగా నిలుస్తామని సూచించారు.



నటుడు పార్థీబన్ భేటీ

జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో ప్రముఖ నటుడు పార్థీబన్ భేటీ అయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన కలిశారు. అయితే పవన్‌తో పార్థీబన్ మర్యాదపూర్వకంగానే భేటీ అయ్యారని జనసేన ఒక ప్రకటనలో పేర్కొంది.

ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలి

- హంద్రీ-నీవా కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- సిపిఎం చిత్తూరు జిల్లా మహాసభ డిమాండ్
- జిల్లా కార్యదర్శిగా వాడ గంగరాజు ఎన్నిక



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలి, కనీస వేతనాలు అమలు చేయాలని, పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని సిపిఎం చిత్తూరు జిల్లా 14వ మహాసభ డిమాండ్ చేసింది. చిత్తూరు కట్టమంచి రోడ్డులోని శాంతా రఘురామ్ కల్యాణ మండపంలో రెండు రోజులపాటు జరిగిన జిల్లా మహాసభ ఆదివారంతో ముగిసింది. 12 అంశాలపై ప్రవేశపెట్టిన తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. హంద్రీ-నీవా కాలువ పెండింగ్ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని, అడవిపల్లి రిజ్వరాయర్ పనులు పూర్తి చేసి చిత్తూరుకు తాగునీరు అందించాలని, జానపద కళాకారులకు కాణిపాకం దేవస్థానంలో కళాప్రదర్శనలకు అవకాశం కల్పించాలని, మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పవర్‌లూమ్ కార్మికులకు తమిళనాడు తరహాలో 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, భూకబ్జాలను అరికట్టాలని, మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారాలు, దాడులు అరికట్టాలని, దళితులపై దాడులు అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తొలుత సిపిఎం జెండాను పార్టీ సీనియర్ నాయకులు హైదర్‌వలి ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులు స్థూపానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు నివాళులర్పించారు. జిల్లా నాయకులు సురేంద్రన్, షకీల అధ్యక్షతన సమావేశం కొనసాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సద్ధం కావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి పిలుపునిచ్చారు. దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం పేదల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరల అదుపు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గత మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో నిర్వహించిన ప్రజాసమస్యలపై పోరాటాలను సమీక్షించి రానున్న మూడేళ్లలో ప్రజాసమస్యలపై భవిష్యత్తు పోరాటలకు రూపకల్పన చేశారు.

రెండోసారి జిల్లా కార్యదర్శిగా గంగరాజు



మహాసభలో సిపిఎం చిత్తూరు జిల్లా నూతన కార్యదర్శిగా వాడ గంగరాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా సురేంద్రన్, ఓబుల్‌రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, షకీల ఎన్నుకోబడ్డారు.



విక్టరీ ఎట్ సి స్తూపంపై చరిత్రను తెలుపుతూ సాగుతున్న లేజర్ షో

సాగర తీరంలో 'విక్టరీ ఎట్ సీ' లేజర్ షో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఆదివారం సాయంత్రం జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖ బీచ్ రోడ్డులోని వైఎంసిఎ సమీపాన ఉన్న 'విక్టరీ ఎట్ సి' స్తూపంపై ఏర్పాటు చేసిన సౌండ్, లేజర్ ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఈ షోను చూసేందుకు ప్రజలు పోటెత్తారు. 1971 నౌకాదళం యుద్ధం, విశాఖ నగరం పాత్ర, యుద్ధ వీరుల సాహసాలు, దేశ చరిత్ర అంశాలను అందరికీ తెలియజెప్పేలా ఈ షోను చేపట్టారు.

కార్యక్రమాన్ని ఉద్దేశించి జివిఎంసి ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద్ రాజు మాట్లాడుతూ.. ఈ షో మూడేళ్లపాటు ప్రతి ఆదివారం ప్రజలు వీక్షించేలా జివిఎంసి కాంట్రాక్టు కుదుర్చుకుందని తెలిపారు. ఇండియన్ నేవీ సహకారంతో ప్రోగ్రామ్‌ను రూపొందించి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో అమలు జరుపుతున్నామన్నారు. తొలి ప్రదర్శనకు అధిక సంఖ్యలో ప్రజలు, సందర్శకులు హాజరై కార్యక్రమాన్ని విజయంతం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. లేజర్ షో నిర్వహణకు సహకరించిన పోలీసు యంత్రాంగానికి, ఇండియన్ నేవీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ - 1 డాక్టర్ అజిత, అదనపు కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) రాజ్ కమల్, జివిఎంసి పర్యవేక్షక ఇంజనీర్ పివివి.సత్యనారాయణ రాజు, సహాయక ఇంజనీర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో మోసం

భీమవరం : పురోహిత, అర్చక సమాఖ్య పరీక్షల పేరిట నకిలీ సర్టిఫికెట్లతో అక్రమార్జనకు పాల్పడుతోన్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌విఎస్.శర్మ, జి.ధనుష్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ హరిజవహర్ లాల్ పనిచేస్తున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ పురోహిత, అర్చక సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఉన్న యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శనం దుర్గబాబులు రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని గ్రామాలు, పట్టణాలు, వివిధ ప్రాంతాల దేవాలయాలలో పనిచేస్తున్న అర్చకులకు, పురోహితులకు పరీక్షలు నిర్వహించారన్నారు. అర్హత పట్టాలు అందజేస్తామని ఆ పట్టాల ద్వారా పర్సనల్ లోన్లు, బ్యాంకు లోన్లు, విదేశాలకు పాస్ పోర్టులు, రైల్వే ప్రయాణాలకు రాయితీ టికెట్లు పొందవచ్చునంటూ రాష్ట్రంలోని అర్చక, పురోహిత విద్యార్థులను నమ్మించి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలైన తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గ దేవస్థానం, అన్నవరం దేవస్థానాల నకిలీ స్టాంపులు, ఆగమ, పరీక్షాధికారుల ఫోర్జరీ సంతకాలతో నకిలీ సర్టిఫికెట్లు తయారుచేసి ఆ సర్టిఫికెట్లతో వేలాది రూపాయల అక్రమార్జనకు పాల్పడుతున్నారన్నారు. ఈనెల 28న భీమవరం ఆనంద్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ పరీక్షల్లో విజయం సాధించిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నామని సామాజిక మాధ్యమాలలో వీడియోలతో యామిజాల నర్సింహమూర్తి, సుదర్శనం దుర్గబాబులు పలు రకాలుగా ప్రచారం నిర్వహించి మోసానికి పాల్పడినట్లు తెలిసింది.

అక్రమ లేఆఫ్ ప్రకటించిన అభిజిత్ కంపెనీపై చర్యలు

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మిక చట్టాలు ఉల్లంఘించి అక్రమంగా లేఆఫ్ ప్రకటించిన అభిజిత్ ఫెర్రోటిక్ లిమిటెడ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అక్రమంగా లే-ఆఫ్ ప్రకటించిన కంపెనీ తెరిపించి కార్మికులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న అభిజిత్ కంపెనీ.. కార్మికులకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఈ నెల 13 నుంచి మూసేసిందని తెలిపారు. 15 రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారని వివరించారు. కంపెనీ మూసివేయడంతో అందులో పనిచేస్తున్న వెయ్యిమంది కార్మికుల కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం ఏనాడూ కార్మిక చట్టాలు, కనీస వేతనాలను అమలు చేయలేదని పేర్కొన్నారు. సెజ్‌లో పక్కనే ఉన్న మైతాన్, సుందరం, లలితా ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీల కంటే అభిజిత్‌లోని కార్మికుల జీతాలు తక్కువే అని తెలిపారు. గతంలో కార్మికులు ఆందోళన చేసినప్పుడు డస్ట్, హీట్ అలవెన్స్‌లు ఇస్తామని అంగీకరించిన యాజమాన్యం మాట తప్పిందని పేర్కొన్నారు. జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని, ప్రతినెలా 5వ తేదీకి ఇవ్వాల్సి ఉండగా, 24వ తేదీ వరకు ఇవ్వడం లేదని వివరించారు. సెజ్‌ల కోసం తమ భూములు త్యాగం చేసి నిర్వాసితులుగా మారిన వారే అత్యధికంగా ఈ కంపెనీలో పనిచేస్తున్నారని తెలిపారు. తమ ప్రాంతంలో కంపెనీలు వస్తే తమకు, తమ పిల్లలకు ఉపాధి దొరుకుతుందని భావించిన నిర్వాసితుల జీవితాలతో అభిజిత్ యాజమాన్యం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా కాలంలో విధులకు రాలేని పరిస్థితుల్లో కూడా బలవంతంగా యాజమాన్యం పనిచేయించుకుందని వివరించారు. అనేక ఇబ్బందులు పడుతూ కరోనాలో కూడా కార్మికులంతా కంపెనీ కోసం పనిచేశారని పేర్కొన్నారు. కోట్ల రూపాయల లాభాలు గడిచినప్పుడు మాట్లాడని యాజమాన్యం నష్టాలు పేరు చెప్పి ఇప్పుడు లేఆఫ్ ప్రకటించడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మూసివేసిన అభిజిత్ ఫెర్రోటిక్ లిమిటెడ్ కంపెనీని తెరిపించి కార్మికులను ఆదుకోవాలని కోరారు.


దీక్షల్లో కూర్చున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల జోలికొస్తే ఊరుకోం

- స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల జోలికొస్తే సహించేది లేదని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఒ.వి.రావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1354వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్తును అంధకారం చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలతో ఉక్కు యాజమాన్యం కుట్రలు చేస్తోందన్నారు. శాశ్వత కార్మికులతో భుజం భుజం కలిపి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల నడ్డి విరవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్మికుల సంఖ్యను కుదించే చర్యలను మానుకోవాలన్నారు. లేనిపక్షంలో స్టీల్‌ప్లాంట్‌ను కార్మికవర్గం స్తంభింపజేస్తుందని హెచ్చరించారు. దీక్షల్లో సంఘం ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, నాయకులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలకు పరిష్కారం కోరుతూ..

6న చలో కలెక్టరేట్

- ఎస్ఎఫ్ఐ పిలుపు
- నేటి నుంచి మండల కేంద్రాల్లో నిరసనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నవంబరు 6న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ వెల్లడించారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో తహశీల్దారు కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో 'చలో కలెక్టరేట్'కు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం విడుదల చేసిన అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యాదీవెన, వసతిదీవెన నిధులు రూ.3,480 కోట్లు పెండింగ్‌లో ఉంచిందని చెప్పారు. దీనివల్ల చదువులు పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలు యూనివర్సిటీల్లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని వెల్లడించారు. బకాయిల విడుదల విషయంలో నూతన ప్రభుత్వం కూడా జాప్యం చేస్తూ కల్లబొల్లి మాటలు చెప్తుందన్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బడికి వెళ్తున్న ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఈ పథకం ప్రస్తుత విద్యా సంవత్సరంలో అమలవుతుందో లేదోననే గందరగోళం నెలకొందని పేర్కొన్నారు. పిజి విద్యకు అడ్డంకిగా మారిన జిఒ 77ను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. జిఒ రద్దు గురించి పలుమార్లు అడిగినా వాటి ఊసేలేదన్నారు. డిగ్రీ విద్యార్థుల పాలిట శాపంగా ఉన్న హానర్స్ విధానాన్ని వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత ప్రభుత్వం నిలిపేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్టళ్ల విద్యార్థులకు అరకొర వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. అన్న క్యాంటీన్లకు రూ.96 కేటాయిస్తున్న ప్రభుత్వం హాస్టళ్ల విద్యార్థులకు మాత్రం రూ.53లే కేటాయిస్తోందని పేర్కొన్నారు. ధరలకు అనుగుణంగా మెస్ బిల్లు రోజుకు రూ.100లకు పెంచాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లోని అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు వినతులు అందించినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాటపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి, నాయకులు యోగి, రాంబాబు, జ్వలిత, షణ్ముఖ్ పాల్గొన్నారు.

విఒఎల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విఒఎల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో పోరాటం తప్పదని ప్రభుత్వాన్ని ఎపి వెలుగు విఒఎల ఉద్యోగుల సంఘం హెచ్చరించింది. ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 'మూడేళ్లకు ఒకసారి విఒఎలను మార్చుకునే అవకాశం ఉందని వ్యాఖ్యానించడం' వీరిని మోసం చేయడమేనని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ రూపాదేవి, కె ధనలక్ష్మి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి, మంత్రికి యూనియన్ నాయకులు అనేక పర్యాయాలు ఈ అంశంపై వినతిపత్రాలు అందించారని, ఇందుకు విరుద్ధంగా మంత్రి వ్యాఖ్యలు ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా విఒఎలు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో విఒఎలపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు పెరిగాయని, నిబంధనలకు విరుద్ధంగా వేలాది మందిని తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విఒఎలు గ్రామ సంఘం ఉద్యోగులని, సొసైటీ చట్ట ప్రకారం వీరి నియామకం, తొలగింపు హక్కు గ్రామ సంఘాలకే ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా కాలపరిమితి సర్క్యులర్ తీసుకొచ్చిందని, ఈ సర్క్యులర్ అమలు కాకుండా విఒఎల సంఘం అనేక పోరాటాలు చేశారని, ఈ పోరాటాల్లో పాల్గొన్న చంద్రబాబు, లోకేష్ సర్క్యులర్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 2024 జనవరి 30, 31 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన ధర్నాల్లో టిడిపి నాయకులు వర్ల రామయ్య సర్క్యులర్ రద్దుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు

పోరాటాలతోనే రాజ్యాధికారం

- అన్నమయ్య జిల్లాలో ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి
- రూ.లక్ష కోట్లు కేటాయిస్తే జిల్లా సమగ్రాభివృద్ధి
- జిల్లా ప్రథమ మహాసభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - రాయచోటి

రాజ్యాధికారాన్ని దక్కించుకునేలా పేదలు, కార్మికులు సంఘటితంగా పోరాడాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం చిత్తూరు రోడ్డులోని కెజిఎస్ ఫంక్షన్ హాల్‌లో సిపిఎం జిల్లా ప్రథమ మహాసభ ఆదివారం ప్రారంభమైంది. మొదటగా సిపిఎం శ్రేణులు పట్టణంలోని నేతాజీ సర్కిల్ నుంచి బొంబాయి లాడ్జి, గునిగుంట్ల రోడ్, చెక్ పోస్ట్ మీదుగా చిత్తూరు మార్గంలోని కెజిఎస్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించాయి. పట్టణ ప్రజలు, పార్టీ సానుభూతి పరులు ఎర్రజెండాలు చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ఫంక్షన్ హాలులో పార్టీ జెండాను గఫూర్ ఆవిష్కరించారు. సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా సిహెచ్ చంద్రశేఖర్ టి హరిశర్మ, కె శివ వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గఫూర్ మాట్లాడుతూ దేశంలో సామాన్యులకు న్యాయం జరగడంలేదని, బూర్జువాలు, పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తుల నుంచి శ్రామిక కర్షక వర్గం చేతుల్లోకి రాజ్యాధికారం వచ్చినప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. సామ్రాజ్యవాదాన్ని నాశనం చేయడంతోనే కార్మికవర్గ రాజ్యస్థాపన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పేదలంతా కలసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. అమెరికా సామ్రాజ్యవాదం, పెత్తందారీ ధోరణి కారణంగానే రష్యా - ఉక్రెయిన్ల నడుమ యుద్ధం, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని వివరించారు. యుద్ధనీతిని తప్పి గాజాలోని ఆస్పత్రులు, పాఠశాలలపై ఇజ్రాయిల్ ప్రభుత్వం అమానవీయ దాడులకు దిగడం అత్యంత హేయమన్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం వెంటనే గాజా, లెబనాన్లపై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. రష్యా-ఉక్రెయిన్లు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అలీన విదేశాంగ విధానాన్ని బలహీనపర్చి సామ్రాజ్యవాద అనుకూల విధానాన్ని అనుసరిస్తోందని తెలిపారు. ఇజ్రాయిల్‌కు మోడీ ప్రభుత్వం మద్దతునిస్తుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులు, శ్రామికులు, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్పొరేట్, మతోన్మాదులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. దేశప్రజల నడుమ ఐక్యతను దెబ్బతీసేలా మతాల పేరుతో దాడులను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. ఢిల్లీ, యుపిలలో ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ పోరాడే వారి ఇళ్లను బుల్ డోజర్లతో కూల్చివేయడం బిజెపి దమననీతికి తార్కాణమన్నారు. చట్టసవరణ చేయడం ద్వారా వక్ఫ్ బోర్డులో హిందువులను సభ్యులుగా నియమించాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. రూ.49 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి రూ. లక్ష కోట్లు నిధులు కేటాయిస్తే కరువును పారదోలవచ్చునని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నరసింహులు మాట్లాడుతూ కడప బెంగళూరు రైల్వే పనులు, మదనపల్లె ఫైలు దగ్ధం సమస్యల కోసం అందరం కలిసి పోరాడాలని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు నేతలు రామాంజులు, రవికుమార్ ప్రసంగించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి మణి, వెంకటరామయ్య, రాజమ్మ, హరిశర్మ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ప్రథమ మహాసభల్లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

రూ.3 లక్షల కోట్లకు పైనే..

- బడ్జెట్‌కు కసరత్తు వేగవంతం
- నవంబర్ 15 తరువాత అసెంబ్లీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వచ్చే నెల్లో పెట్టబోయే వార్షిక బడ్జెట్‌పై రాష్ట్ర ఆర్థికశాఖ కసరత్తును వేగవంతం చేస్తోంది. సుమారుగా నవంబర్ 15వ తేదీ నుంచి 20వ తేదీ మధ్యలో బడ్జెట్ సమావేశాలు ఉంటాయని చెబుతున్నారు. అలాగే చివరి నాలుగు నెలల కాలానికి మాత్రమే ఈ బడ్జెట్ అవసరం ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల కోసం మొత్తం 12 నెలల కాలానికి బడ్జెట్‌ను రూపొందించాల్సిన అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గత ఫిబ్రవరిలో అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2.86 లక్షల కోట్ల వరకు ఉంది. అయితే పెరిగిన వ్యయం, తగ్గిన ఆదాయం కారణంగా అనాటి బడ్జెట్ ప్రస్తుత ప్రభుత్వానికి అక్కరకు రాకపోవడంతో జూలై నెలాఖరులో కొత్త ప్రభుత్వం కూడా ఓట్ ఆన్ అక్కౌంట్‌కు వెళ్లాల్సి వచ్చింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలలూ ఓట్ ఆన్ అక్కౌంట్‌తోనే కాలం నెట్టుకు రావాల్సి వచ్చింది. చివరి నాలుగు నెలలూ కూడా ఓట్ ఆన్ అక్కౌంట్‌కే వెళ్లడం సాంకేతిక కారణాల రీత్యా సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. దీంతో ఈ సారి పూర్తి బడ్జెట్‌నే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. తాజాగా పెట్టే బడ్జెట్‌లో ఖర్చులకు అనుకూలంగా మూడు లక్షల కోట్లపైగానే ప్రతిపాదించనున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వం ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కన్నా 20 నుంచి 25 వేల కోట్లు నిధులు అదనంగా కావాల్సి ఉంటుందని తాజాగా అధికారులు గుర్తించారు. ఈ లెక్కన మొత్తం బడ్జెట్ కూర్పు 3.10 నుంచి 3.15 లక్షల కోట్ల వరకు ఉండాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అయితే చివరి నాలుగు నెలలకే కాబట్టి మూడు నుంచి 3.05 లక్షల కోట్లకే పరిమితం చేసే అలోచనలో ఉన్నట్లు సమాచారం. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిల్లో ప్రవేశపెట్టే 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలు మాత్రం జంబో స్థాయిలో ఉండేలా చూడాలని కూడా యోచిస్తున్నారు.

రెండు శాఖల ఆదాయంపైనే

వచ్చే నెల ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సయిజ్ శాఖల ద్వారా వచ్చే ఆదాయంపైనే ఎక్కువగా దృష్టి సారించాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఆయా శాఖల నుంచి కొద్ది రోజుల క్రితమే ఆర్థికశాఖ ప్రతిపాదనలు కూడా కోరినట్లు తెలిసింది. ఇప్పటివరకు ఎంత ఆదాయం వస్తోంది, దానిని ఎంతవరకు పెంచేందుకు అవకాశాలున్నాయన్న కోణంలో వివరాలు సమర్పించాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ కోరినట్లు సమాచారం.

అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అభివృద్ధి వికేంద్రీకరణ, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. యువతకు రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఆరు పాలసీలను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని వెల్లడించారు. లోకేష్ అమెరికా పర్యటనలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ శ్రీకర్ రెడ్డి ఆధ్వర్యాన పారిశ్రామికవేత్తలతో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో పెద్దయెత్తున పెట్టుబడుల కోసం సిఎం చంద్రబాబు ఎదురుచూస్తున్నారని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కియా ఒక ఉదాహరణ అని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం నెలకొందన్నారు. దేశంలోనే అతిపెద్ద తీరప్రాంతం రాష్ట్రానికి ఉందని, త్వరలో నాలుగు పోర్టులు రాబోతున్నాయని చెప్పారు. కర్నూలు జిల్లాను డ్రోన్ వ్యాలీగా తీర్చిదిద్దాలని సిఎం సంకల్పించారని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాలను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తయారుచేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే దేశంలో తయారయ్యే సెల్‌ఫోన్లలో 25 శాతం రాష్ట్రంలోనే తయారవుతున్నాయని, దేశవ్యాప్తంగా 50 శాతం ఎసిలు కూడా రాష్ట్రంలోనే తయారవుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా ప్రకాశం జిల్లాలో బయోఫ్యూయల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. డిసెంబరు నుంచి అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. కృష్ణా, గుంటూరు రీజియన్‌లో 5 బిలియన్ డాలర్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని చెప్పారు.

గోదావరి జిల్లాల్లో ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, పెట్రో కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలు, ఉత్తరాంధ్రలో కెమికల్, ఫార్మా రంగాలపై దృష్టిసారించామని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖపట్నంలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ డేటా సెంటర్ రాబోతుందని వెల్లడించారు. భారత్‌లో డాటా రెవెల్యూషన్ రాబోతోందన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయని పరిశ్రమవర్గాలు అంచనా వేస్తున్నాయని, ఇందులో రాష్ట్రం కీలకపాత్ర పోషించబోతోందని తెలిపారు. అమెరికాలోని వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని ప్రపంచ ప్రఖ్యాత డాటా సేవల సంస్థ ఈక్వెనెక్స్ డాటా సెంటర్ కేంద్ర కార్యాలయాన్ని మంత్రి లోకేష్ ప్రారంభించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్


విద్యుత్ కాంతుల్లో ఫ్లోటింగ్ రెస్టారెంట్

పర్యాటకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడతాం

- మంత్రి కందుల దుర్గేష్
- బ్రిడ్జిలంకలో ఫ్లోటింగ్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పర్యాటక రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బ్రిడ్జిలంకలో 'ఆహ్వానం కిచెన్' ఫ్రాంచేజీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ రెస్టారెంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే రాజమహేంద్రవరంలోని హేవలాక్ బ్రిడ్జి సమీపంలోని గోదావరి తీరంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో గోదావరి తీరాన్ని అందంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో అడుగులు వేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే ఫ్లోటింగ్ రెస్టారెంట్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్ల కాలానికి పర్యాటక రంగం అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. పిపిపి విధానంలో పర్యాటక రంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని అవకాశాలు ఇక్కడ ఉన్నాయన్నారు. స్టూడియోల నిర్మాణానికి ముందుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.పద్మవతి, జనరల్ మేనేజర్ రాజారామ్, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాసు, రాష్ట్ర టూరిజం బోర్డ్ సభ్యులు వాసిరెడ్డి రాంబాబు, టూరిజం ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటచలం, 'ఆహ్వానం కిచెన్ ఫ్రాంఛేజిస్' ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉల్లి రైతుల సమస్యలు పరిష్కరించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లా ఉల్లి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.3 వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత వారం రోజులుగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు నిండిపోయిందని, ఉల్లి దిగుబడులకు అనుగుణంగా అవసరమైన సౌకర్యం కల్పించడం, వాటి అమ్మకాలకు సంబంధించిన ఏర్పాట్లు చేయడంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఉల్లి అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ఈనామ్ పద్ధతిలో కొనుగోలు చేసేందుకు సర్వర్ సమస్య తలెత్తడంతో కొనుగోళ్లకు ఆటంకం కలుగుతోందన్నారు. టెండర్ విధానంలో కూడా ఆలస్యం జరుగుతోందని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. వ్యాపారులు కొనుగోలు ధరలు తగ్గించేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి ఉల్లికి క్వింటాలుకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని, అత్యధిక భాగం ఉల్లి క్వింటాలు వెయ్యి రూపాయలు అంతకంటే తక్కువ ధర వ్యాపారులు ఇస్తున్నారని నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కనీసం మద్దతు ధర క్వింటాలుకు రూ.3 వేలు ప్రకటించి అమలు చేయాలని, ఏ రోజు దిగుబడులు అదేరోజు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి దొంగతనాలు జరగకుండా చూడాలని, మార్కెట్ యార్డులో ఉల్లి వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

విఐపి బ్రేక్ దర్శనాలు 31న రద్దు

ప్రజాశక్తి- తిరుమల:

ఈ నెల 31వ తేదీన తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం సందర్భంగా స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులు మినహా విఐపి బ్రేక్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. ఇందుకు సంబంధించి 30వ తేదీ బుధవారం తిరుమలలో సిఫార్సు లేఖలు స్వీకరించబడవని టిటిడి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది.

బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు అవసరం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - కడప అర్బన్


మన దేశపు మువ్వన్నెల జాతీయ పతాకం సగర్వంగా ఎగరాలంటే ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, కోల్, స్టీల్, రైల్వే, బిఎస్‌ఎన్‌ఎల్, డిఫెన్స్, విద్యుత్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం బలహీనపరచడం మానుకోవాలని ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. బలమైన ప్రభుత్వ రంగం అవసరమని తెలిపారు. దేశ స్వావలంబనను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. 'ప్రభుత్వ రంగ సంస్థలు ఈ దేశానికి ఎందుకు అవసరం?' అనే అంశంపై వైఎస్ఆర్ జిల్లా కడపలోని డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సంక్షోభాల నుంచి భారతదేశాన్ని ప్రభుత్వ రంగమే కాపాడిందన్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యలకు కేవలం వ్యవసాయ సంక్షోభమే కారణం కాదని, విద్యా, వైద్య రంగాలు ప్రయివేటీకరణకు గురి కావడం, రైతుల జీవితాల్ని ఛిద్రం చేయడంతో బతకలేక, దిక్కుతోచక ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన వివరించారు. రాష్ట్రంలో అమరావతిని కార్పొరేట్ సంస్థల ద్వారా అభివద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చెప్పే మాటలు అసంబద్ధమని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వ రంగ సంస్థలే శరణ్యమని, ఒకప్పుడు బాగా వెనుకబడిన విశాఖపట్టణం గొప్ప ఆర్థిక రాజధానిగా ఈ మూడు దశాబ్దాలలో రూపాంతరం చెందడం ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ మత్తులో పాలకులు మాత్రమే ఉన్నారని, ప్రజలు దీనిని పూర్తిగా తిరస్కరిస్తున్నారని తెలిపారు. రిలయన్స్ జియోపై వినియోగదారులు నమ్మకం కోల్పోవడమే దీనికి తాజా సూచిక అన్నారు. కార్పొరేట్ మీడియా సృష్టిస్తున్న మాయాజాలాన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావి వర్గం సమర్థంగా ఎదుర్కోవడం ద్వారా ప్రయివేటీకరణ దాడిని తిప్పి కొట్టగలమని చెప్పారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.వి.చంద్రచూడ్ పెన్షన్ ఒక విడదీయరాని కార్మికుల హక్కు అని తీర్పు చెప్పారని, మారిన పరిస్థితుల్లో పాత పెన్షన్ స్కీం సాధించుకోవడం అసాధ్యం కాదని తెలిపారు. ఎల్ఐసిని రెండు దశాబ్దాల ప్రయివేటు పోటీ తర్వాత కూడా అగ్రశ్రేణిలో సిబ్బంది నిలబెట్టుకోవడం దీనికి ఉదాహరణ అన్నారు. డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో సంఘాల నాయకులు రఘునాథ్‌రెడ్డి, వసుప్రద, శంకర్రావు, మహేశ్వర్ రెడ్డి, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్. శర్మ

సమాజ మార్పే లక్ష్యంగా తాత్విక చింతన ఉండాలి

కడప ప్రతినిధి:సమాజాన్ని మార్చడమే లక్ష్యంగా తాత్విక చింతన ఉండాలని, ప్రాచీన తాత్విక సిద్ధాంతాల్లోని అభ్యుదయ భావాలతో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ఎదుర్కోవాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. 'మధ్య యుగాల్లో భారతీయ తాత్విక చింతన' అనే అంశంపై వైఎస్ఆర్ జిల్లా పరిషత్ ఆవరణంలోని కడప పంచాయతీరాజ్ భవనంలో ఆదివారం సదస్సు జరిగింది. బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ సభ్యులు పిళ్లా కులాయిస్వామి అధ్యక్షతన జరిగిన సదస్సులో శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్తమానానికి ఉపయోగపడే విధంగా తాత్విక దృష్టి ఉండాలన్నారు. మతం పేరుతో రాజకీయాలు నడపడం ప్రజలకు ద్రోహం చేయడమే అవుతుందని తెలిపారు. తాత్విక చింతనను చరిత్ర నుంచి విడగొట్టడం కష్టమని చెప్పారు. కీస్తు శకం 6వ శతాబ్దం నుంచి బౌద్ధ, జైన మతాలు వర్ధిల్లాయని తెలిపారు. యజ్ఞాలకు పశువుల బలిని ఆపాలనే అంశం దగ్గర నుంచి బౌద్ధానికి, వైదికానికి పేచీ మొదలైందన్నారు. బౌద్ధం పశువులను వ్యవసాయానికి మళ్లించడంతో హుణులు బౌద్ధం వైపు ఆకర్షితులయ్యారని తెలిపారు. బౌద్ధం శాస్త్రం విజ్ఞానాన్ని, వైద్యాన్ని విస్తృతం చేసిందన్నారు. శ్రీకృష్ణుని ఉద్బోధిత భగవద్గీత తాత్విక భూమిక భూస్వామ్య వాదాన్ని బలపరచడమే అవుతుందని తెలిపారు. బౌద్ధులు అందరినీ కలుపుకుని ఆరామాలు, ఉత్సవాలు నిర్వహించారని, బ్రాహ్మణులు అందరినీ దూరం చేసే యజ్ఞాలు చేశారని ఎత్తిచూపారు. బౌద్ధారామాల్లోకి అందరికీ అనుమతి లభించేదని, దేవాలయాల్లోకి బ్రాహ్మణులు మాత్రమే ప్రవేశించేవారని వివరించారు. గుప్తుల పతనం అనంతరం చేతివృత్తుల వాళ్లు గ్రామాల్లోకి ప్రవేశించడంతో బ్రాహ్మణాధిపత్యానికి సవాళ్లు ఎదురయ్యాయని తెలిపారు. భక్తి ఉద్యమం అనంతరం సంఘసంస్కర్తలు వెలుగులోకి వచ్చారన్నారు. సిక్కు మతం, సూఫీ మతం, ఇతర ప్రముఖ గ్రంథాలు స్థానిక భాషల్లోకి అనువదించబడ్డాయని తెలిపారు. దీంతోపాటు తులసీదాస్, పోతన, వీరబ్రహ్మం, త్యాగరాజు, అన్నమయ్య, వేమన, సక్కుబాయ్, మీరాబాయ్, మొల్ల వంటి అభ్యుదయవాదులు వెలుగులోకి వచ్చారని తెలిపారు. ప్రముఖ కవి దాదాహయత్ 'ఇస్లాం - సూఫీ - క్రిస్టియానిటీ' అనే అంశంపై మాట్లాడుతూ యూనివర్సల్ బ్రదర్ హుడ్‌ను దెబ్బతీయడానికి సిటిజన్ షిప్‌ను తీసుకొచ్చారన్నారు. యూనిఫామ్ సివిల్‌కోడ్‌లోని మౌలిక లక్ష్యం ముస్లిములు, క్రిస్టియన్లు, బౌద్ధులపై మనుస్మృతిని రుద్దడమేనని తెలిపారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ కల్చరల్ సభ్యులు ప్రసాద్, ప్రముఖ వైద్యులు ఓబుల్‌రెడ్డి, రాజావెంగల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి పలువురు ఇంటలెక్చువల్స్ పాల్గొన్నారు.


ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి

నిరవధిక దీక్ష భగ్నం

- ఉద్యమం ఆగబోదంటున్న 'ఇథనాల్' బాధితులు
- గుమ్మళ్లదొడ్డిలో కలెక్టర్ ప్రశాంతి పర్యటన

ప్రజాశక్తి-గోకవరం(తూర్పు గోదావరి)

కాలుష్య కారకంగా మారిన అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీని మూసేయాలంటూ తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర, పాటంశెట్టి శ్రీదేవి దంపతులు ఐదు రోజులుగా చేపట్టిన నిరవధిక దీక్షను పోలీసులు భగ్నం చేశారు. శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో పోలీసులు ఒక్కసారిగా వాహనాల్లో దీక్షా శిబిరం వద్దకు వచ్చారు. దీక్షలో ఉన్న వారిని బలవంతంగా అంబులెన్స్‌లోకి ఎక్కించారు. శిబిరంలో ఉన్న గ్రామస్తులు పోలీసులను అడ్డుకోటానికి ప్రయత్నించారు. గ్రామస్తులు తేరుకునే లోపే దీక్షల్లో కూర్చున్న శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవిలను అంబులెన్స్‌లోకి ఎక్కించి రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, తమకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని తెలిపారు.

బాధితులతో చర్చించిన కలెక్టర్ ప్రశాంతి

తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం గుమ్మలదొడ్డి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని, యాజమాన్యంతో చర్చిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. అనంతరం కంపెనీకి అతి సమీపంలో ఉన్న దళితవాడల్లో ఆమె పర్యటించారు. కంపెనీ నుంచి వచ్చే వర్థాలతో కలుషితమైన నీరు గ్రామంలో ఉన్న కోనేటివారి చెరువులో కలుస్తుందని గ్రామస్తులు తెలపడంతో ఆ చెరువు నీటిని పరీక్షలకు పంపి నివేదికను వెంటనే అందించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గ్రామానికి చెందిన ఐదుగురు సభ్యులతో కంపెనీని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ కృష్ణనాయక్, కాలుష్య నివారణ మండలి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

కెటిఆర్ బామ్మర్ది ఫామ్‌హౌజ్‌లో రేవ్‌పార్టీ?

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి రేవ్ పార్టీ జరిగింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని జన్వాడలోని రాజ్ పాకాల ఫామ్‌హౌజ్‌పై ఎస్ఒటి, మోకిలా పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు మూకుమ్మడిగా శనివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దాంతో పోలీసులు బిఆర్ఎస్ నేతలను అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే ఇదంతా సిఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో కెటిఆర్‌పై జరుగుతున్న కుట్రగా బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

జన్వాడలోని రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ జరుగుతున్నట్టు పోలీసులకు పక్కా సమాచారం అందండంతో ఎస్ఒటి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ పార్టీలో 21 మంది పురుషులు, 14 మంది మహిళలు మొత్తం 35 మంది ఉన్నారు. ఈ దాడుల్లో ఏడు లీటర్ల విదేశీ మద్యం బాటిల్స్‌ను సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ఈ పార్టీ నడిపించినట్టు, రాజేంద్రనగర్ ఎసిపి ఆదేశాల మేరకు పార్టీలో పాల్గొన్న విజయ్ మద్దూరికి మోకిలా పోలీసులు పరీక్షలు నిర్వహించగా డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్టు సమాచారం. ఈ మేరకు విజయ్ మద్దూరి, రాజ్ పాకాలపై కేసు నమోదు చేసి మోకిలా సిఐ వీరబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

రాయదుర్గంలోని రాజ్ పాకాల ఇంట్లోనూ తనిఖీలు

రాయదుర్గంలోని ఒరియాన్ విల్లాలోని రాజ్ పాకాల ఇంట్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ రాజ్ పాకాల లేకపోవడంతో కొద్ది సేపు ఎదురుచూశారు. ఆయన తన సోదరుని ఇంట్లో ఉన్నట్టు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లిన ఎక్సైజ్ పోలీసులకు అక్కడా రాజ్ పాకాల ఆచూకీ లభించలేదు. అతను పరారీలో ఉన్నట్టు సమాచారం. కాగా, ఇదే సమయంలో రాజ్ పాకాల సోదరుని ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అక్కడికి ఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేరుకొని తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. సెర్చ్ వారెంట్ లేకుండా ఎలా దాడులు నిర్వహిస్తారని ప్రశ్నించారు. దాంతో వారి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. బిఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. కెటిఆర్ బంధువులు తమ ఇంట్లో వ్యక్తిగతంగా పార్టీ చేసుకున్నారని, ఆయనను రాజకీయంగా ఎదుర్కోలేక ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తనిఖీలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇలాంటి రాజకీయ కక్షలకు తమ పార్టీ భయపడేది లేదని స్పష్టం చేశారు.



"పుస్తకం అనేది పుస్తకమే! ప్రపంచం మొత్తాన్ని అదే పరిచయం చేస్తుంది అనుకోకండి. మీరు ఏం రాయాలి అనుకుంటున్నారో ఆ పరిస్థితులను స్వయంగా చూడండి. నేరుగా అనుభవించండి. నేరుగా వినండి. మాట్లాడండి. "

– మాక్సిం గోర్కీ

కన్నీటి అస్త్రం!

విశాలాకాశం కప్పు కింద
విరిగి ముక్కలైన బాల్యాన్ని
అతికించుకొంటున్నాయా చిట్టి చేతులు!
యుద్ధం పీడకల వెంటాడుతున్నా
చిరునవ్వుల తూటాలు
జాత్యహంకారుల గుండెల్లో పేలుస్తున్న
నిజమైన యోధులు వాళ్ళు
తమ నేలే తరిమేస్తున్నా
నిలిచిన చోటే మొలిచే లేత చిగుర్లు
తెరవెనక యుద్ధానికి తెరదించి
కనీసవసరాల యుద్ధానికి తెరతీసి
బతుకును జయిస్తున్న సైనికులు
బాంబు పడ్డ బాల్యాన్ని పూడ్చేసి
కొత్త బాల్యానికి కోట కడుతున్న ఆశాదీపాలు
దేనికీ కర్తలు కాని, ఏ క్రియ లేని, ఖర్మ వాళ్ళది!
ఆకలికి తప్ప అణుబాంబుకి కూడా
భయపడని దుస్థితి వాళ్ళది!
వాళ్ళకూ అందమైన కలలున్నాయి
అందులో బతుకూ వుంది భవిష్యత్తూ వుంది
సరికొత్త ఆయుధాలతో
నెత్తుటి నది ఒడ్డున సవాల్ చేస్తున్న యుద్ధమా!
నీ చేతిలో బుగ్గి అయిన బాల్యం
పూవు వంటి లేత బుగ్గపై జారిపడ్డ
వెచ్చటి కన్నీటి బొట్టు మిస్సైల్ సంధిస్తోంది...
కాచుకో...!


– భీమవరపు పురుషోత్తమ్
99498 00253



నలుగురితో నడు ...

వాడు చెప్తూనే ఉంటాడు
నీ చెవిలో రొద పెడ్తూనే ఉంటాడు
నిజమని నమ్మేదాకా ...
మాటల్ని చిమ్ముతూనే ఉంటాడు
భాష ఏదైనా భావమిదే ఉంటుంది
పదుగురితో పదం కలిపితే
పాతాళం దాటలేవు
బృందంతో కలిసొస్తే
బృందావనాలు కానరావు
రెక్కలు బరువెక్కితే
ఏ దిక్కూ ఎగరలేవు
ఒక్కడివే నడిచిరా
పక్కవాడిని తొక్కిరా
చుక్కల్ని చేజిక్కించుకో
ఇదే విజయ రహస్యమంటూ
పదేపదే పలుకుతాడు
లక్ష్యపెట్టకు మిత్రమా,
మనిషితనాన్ని నిర్లక్ష్యం చేయకుమా!
నలుగురితో అడుగులేస్తే
ఆ తోవలోన జీవముంది
చేయిచేయి కలిపి సాగితే
ఆ నడకలోన హాయి ఉంది
వెనకవున్న వానికై,
క్షణ కాలమాగి చూస్తే
నేనున్నానని చేయి చాస్తే
నమ్మకమై నినదిస్తే
నెమ్మదిగా నడిపిస్తే
గమనానికి అర్థముంది
గమ్యానికి పరమార్థముంది.

– డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931.



అచేతనం

చరాచర జగత్తులో
భాగమైన పుడమి పుత్రులు
ఏ దిశగా నడుస్తున్నారు?
హింసా ప్రవృత్తితో
యుద్ధమే గమ్యంగా సాగుతున్నారా?
యుద్ధమంటే బీభత్సం
క్షతగాత్రులమయం
రక్తసిక్తమైన దేహాలతో
తెగిపడిన శరీర భాగాలతో
భీకర రణరంగం!

సైనికులు సామాన్యులు
స్త్రీలు పసికందులు మృత దేహాలుగా
దిగ్భ్రాంతి కలిగించే భయంకర విచ్ఛిన్న క్షేత్రం!

బాంబుల దాడులకు
ఊళ్ళు ఇళ్ళు కూలి
శిథిలాలుగా మారే నిపాత స్వరూపం!
అగ్రరాజ్యాల అండతో
నరరూప రాక్షసులుగా
మారిన దేశ నాయకులు
మానవీయతకు వీడ్కోలిచ్చి
మారణహోమం సాగించేరు
ప్రపంచ ప్రజలు నిస్సహాయంగా
ప్రేక్షకులై వీక్షించేరు!

మరోవైపు –
పర్యావరణ నాశనానికి
కారకులయ్యేరు పథ్వి పుత్రులు
భూమి సహజ సరళ స్వరూపాన్ని
విధ్వంసం చేసేరు
అన్ని వైపులా కలుషితం
అయ్యేను వసుధ పరిసరాలు!
ఏమి పట్టనట్లు
ప్రవర్తించే దేశాధినేతలు
కర్తవ్యం వీడి
మానవజాతి మనుగడ మరచి
యుద్ధం వైపే దృష్టి సారించడం
ఎంతో శోచనీయం!
ఇంకా సామాన్య మానవుల్లో
ఎప్పుడు కలిగేను చైతన్యం?
ఆగేనా అవని వినాశనం?

– శాంతి శ్రీ బెనర్జీ
9871989360

మంచి పఠనానుభవం కథ 2023



ఏది మంచి కథ అనే దానికి అనేక కొలమానాలు వుంటాయి. సమకాలీనంగా మానవ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలు కథా రూపం తీసుకోవడం వల్ల ఆయా కాలాల్లో జరిగిన సంఘటనలు కళాత్మకంగా నమోదవుతాయి. అనేక ఇతర రూపాలు వున్నా కూడా కథలో ఆ ఘటనలు విపులంగా చర్చించే అవకాశం వుంటుంది. నవలలో ఇంకా ఎక్కువ పార్శ్వాలు సశించే అవకాశం వుంటుంది. ఒక సంవత్సరంలో వచ్చే వేలాది కథలలో కొన్ని పరిమితుల మేరకు కథలు ఎన్నుకోవాల్సి వచ్చినప్పుడు– కొన్ని కథలు వస్తువు రీత్యా, కొన్ని శిల్పం రీత్యా, కొన్ని వస్తుశిల్పాల రీత్యా, కొన్ని అభివ్యక్తి నవ్యత మీద ఆధారపడి ఎన్నికవుతాయి. హృదయాలను కదిలించే, మేధకు మేత పెట్టే కథలు చరిత్రలో నిలబడి వుంటాయి కనుక అటువంటి కథలు ఎంపిక చేయడానికి ప్రాధాన్యం వుంటుంది.

గత 34 సంవత్సరాలుగా ఈ పనిని నిరాటంకంగా చేస్తున్న కథా సాహితి ఆనవాయితీగా ఈ సంవత్సరం కూడా 15 కథలతో కథ – 2023 తీసుకువచ్చింది. మొదటి కథ కుప్పిలి పద్మ 'మెట్రో కావల' కథ పల్లెటూరుల నుంచి నగరానికి వలస వచ్చే పేద/ మధ్య తరగతి ప్రజల జీవన సర్దుబాటుల గురించి రాసినది. ఇందులో రచయిత్రి "తల్లి ప్రేమనే మింగేసే యీ ఎదుగుదల నిజంగా ఎదుగుదలేనా?" అని పేదవాళ్ళు తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకునే సందర్భంలో అనగలిగినప్పుడు– సామాజికంగా, ఆర్థిక వెసులుబాటు వున్నవాళ్ళు కూడా విదేశాలకు వలస వెళ్ళినప్పుడు, వాళ్ళు కూడా తల్లిదండ్రులని వదిలేసే వెళుతున్నారు. ఒక్కోసారి అంత్య క్రియలు కూడా హాజరుకాలేక వీడియోలతో సరిపుచ్చుతున్నారు. ఆదాయం పెంచుకుందాం అనుకోవడం తప్పు కానప్పుడు, అది దేనిని వదులుకోవాల్సి వస్తే సమకూరుతుందో కూడా పరిగణన లోకి వస్తుంది కదా! డే కేర్ సెంటర్లు, కుక్కల కెఫేలు భరించే పరిస్థితి మధ్య తరగతి వారికి కూడా వుండదు. కొన్ని సర్దుబాట్లు తప్పనిసరి. మంగ అలాంటి సర్దుబాటు చేసుకోవడానికి సిద్ధమయింది. అటు వున్న ఊరిలో సుఖం వదులుకోలేక, ఇటు నగరంలో అయినోళ్ళు కనపడక, వచ్చే ఆదాయం వదులుకోలేక మధ్యతరగతి నలుగుబాటుని ఈ కథ పట్టుకుంది. మనం చూడని కోణం చూపెట్టింది. కత్తి పద్మ 'పులస' మంచి కథ. ఆడదానికి 'బూవి' వుండాలని పోరాడే రవణమ్మ కథ. సమాజానికి విరుద్ధంగా తన ఆత్మగౌరవం కోసం పోరాడే ప్రతి స్త్రీ ఏటికి ఎదురీదే 'పులస' లాంటిదేనని రచయిత్రి అభిప్రాయం నిజమే అనిపిస్తుంది. ఎదురీదే కొద్దీ రుచి (విలువ) పెరిగే పులస లాగే పోరాడే కొద్దీ ఒక స్త్రీ వ్యక్తిత్వం (విలువ) పెరుగుతుందని ఈ కథ సారాంశం. ఆస్తి హక్కు స్త్రీ ప్రాథమిక హక్కు అనడం వల్ల ఇంకా ప్రజాస్వామ్యీకరించబడని మన పురుష సమాజాల్లో ఎంత దుమారం రేపుతుందో చెప్పిన కథ. ఉత్తరాంధ్ర ప్రాంత మాండలికం కథకు జీవం ఇచ్చింది. కథ నిడివిని కథ నాణ్యత తగ్గకుండా తగ్గించవచ్చు అనిపించింది. బెజ్జారపు రవీందర్ కథ 'సుశీత' లేవనెత్తిన అంశం మంచిదయినా నిర్వహించిన విధానం వల్ల కథలో చర్చించాల్సిన అంశం అంత లోతుగా చర్చకు రాలేదు. టీనేజి దాటని యువతీ యువకులు ముఖ్యంగా యువతుల లైంగికతకు సమాజ మద్దతు వుండదు. ఒకవేళ వారు హద్దు దాటి ప్రవర్తిస్తే దానికి బాధ్యత ఎవరిది? పెరిగిన సాంకేతికత, భ్రమాన్విత జీవితాలు, ఆకర్షణా వలల వలయాల్లో చిక్కుకునే యవ్వన ప్రలోభాల మధ్య చిందరవందర అవుతున్న జీవితాలకి పరిష్కారం ఏమిటి? అని చర్చించాల్సిన కథ సుశీత... అరవింద స్నేహమూ, సంసార వివరాల్లోకి మిస్‌ఫైర్ అయింది. శంకరి లాంటి తెలిసీ తెలియని వయసు యువత ఏ రకంగా ఇలా తప్పుజారి పోతున్నారో చెప్పాల్సిన కథ దారి మళ్ళింది. కథలో అంతస్సారమైన ఈ విషయం అతి తక్కువగా ప్రస్తావనకు వచ్చింది. "జీవితంలో పైకి వచ్చిన స్త్రీలు మిగతా స్త్రీలకు సపోర్ట్ చేసుకుంటూ తోచినంతగా ఆడవాళ్ళ సమస్య మీద పని చేస్తే ఈ ప్రపంచంలో సగం దు:ఖం మాయమౌతుందని" అనుకునే మాట మనం మనలోని అసంతృప్తులని అణచివేయడానికి అనుకునే మాట. ఆ మాట అరవింద అంటే అది నిజమేగా అని సుశీత తనకు చేతనయినంతగా అసహాయులకు పని చేయడం వరకు ఒకే గానీ.. "స్త్రీత్వాన్ని స్వీకరించగల అర్హుడైన పురుషుడే లేడు ఈ లోకంలో" అనడం.. అదీ ఒక బాధిత స్త్రీ శంకరితో సుశీత అనడం అతిశయోక్తిగా వుంది. ఎందుకంటే అప్పటికే శరీరాన్ని అనర్హుడికి అర్పించిన యువతి ఈ మాటలతో మరింత కృంగిపోదా? దీనికి ఉదాహరణగా ప్రణయ్ అమృతల ప్రేమకథ చూడవచ్చు. ఇక్కడ అమృత తను ప్రేమించినవాడిని వివాహ మాడినా, తన భర్తను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నా, ఇంకా అమృతను శూలాల్లాంటి మాటలతో వేటాడుతున్న సమాజాన్ని చూడవచ్చు. చాలా విషయాల్లో మన సమాజం ఇంకా ఆధునిక భావనలను సంతరించుకోలేదు.

పాణిని జన్నాభట్ల 'చేయాల్సిన పని' కథ ఒక అసహాయుడి ఆక్రోశాన్ని భిన్నంగా చెప్పడానికి ప్రయత్నించింది. ఆధునికత జీవితాలను నిస్సారంగా మార్చే వ్యవస్థను తప్పించుకోలేక, తనని తాను సర్దుకోలేక సతమతమై, కాసింత ప్రేమ కోసం తపిస్తూ, తనలో తాను చీకటిలో మునిగిపోయి, తేలలేక, తన చుట్టూ వున్నవారిని కూడా ఆ చీకటిలో ముంచేయడానికి ప్రయత్నించి, విఫలమయి, మరలా ఒక ఆశ కనిపించి, జీవితం మీద ఒక వెలుగు కనిపించి, తనని కూడదీసుకొన్న ఒక వ్యక్తి కథ ఇది. కథ నిర్వహించిన విధానం ఈ కథకు ఆయువుపట్టు. పాణిని కథల వైపు మనం ఆశగా చూడొచ్చని ఈ కథ మనకు ఆశ పెడుతుంది.

అఫ్సర్ కథా వస్తువులు భిన్నమైనవి. క్లిష్టమైనవి. మన అనుభవంలో లేని విషయాలని మనకు అనుభవం అయ్యేలా చేస్తాయి. 'రకూన్' అటువంటి కథ. మన మనసులో తిష్ట వేసుకున్న, మనకే తెలియని అస్పష్ట విద్వేషం మన కళ్ళ ముందు వున్నట్టుగా అనుకోవడం.. ఆందోళన చెందడం కథా వస్తువు. ఈ అమూర్త వివక్షా రూపానికి కనిపించే/ కనిపించని రూపం రకూన్. ఎట్లయితే లేని ద్వేషం మన మనసులో వున్నట్లుగా భయపడుతున్నామో.. అట్లనే లేని రకూన్ కూడా వున్నట్లు భ్రమసి భయపడుతుంటాడు ఈ కథలో పేరు లేని ప్రధాన పాత్రధారి. అయితే ఈ కథ చెప్పే Tone ఈ కథకు ప్రత్యేకమైనది. ఈ Tone కథకు Outsider. కథనానికి Insider. ఒక ముస్లిమ్ రచయిత ఒక హిందూ కుటుంబ నేపథ్యంలో నీగ్రో జాతి గురించి చేసిన వ్యాఖ్యానం ఈ కథ. ఈ కథ అనేక మంది తెలుగువాళ్ళనే కాదు.. తెల్లవాళ్ళలోనూ వేళ్ళూనుకున్న భావాలను బయటేసిన కథ. అఫ్సర్ కవి కావడం వల్ల అతని కథల అభివ్యక్తిలో కాస్తంత మార్మికత వ్యక్తం అవుతుంది. వలస వెళ్ళినవాడిగా కూడా ఆ దిగులు, విచారమూ, తెలిసిన ముఖాల కోసం వెతుకులాట అతని కథల్లో గట్టిగానే కనిపిస్తాయి. రకూన్ ఒక ప్రతీకగా చెప్పిన ఈ కథ సామాన్య పాఠకునికి కొరుకుడు పడుతుందా? అన్నది చూడాలి.

వేంపల్లి షరీఫ్ 'అన్‌షెడ్యూల్డ్' అతి సాదా మధ్యతరగతి జీవితాల్లో యంత్రాలకు వచ్చే మరమ్మతులు వారి జీవితాలను ఎలా యాంత్రికంగా మారుస్తున్నాయో చెప్పిన కథ. ఈ కథలోని వస్తువు అతి సాదాదే అయినా, సాదాగానే కథ చెప్పినా కూడా, కథ చెప్పడంలో లాఘవం, ఒడుపు మనలని మంత్రిస్తాయి. ఇది అందరి అనుభవంలోనిదే కావడం వల్ల కూడా ఎక్కువమంది ఈ కథకు మమేకం చెందుతారు. స్ఫూర్తి కందివనం 'ముసురు' కల్లుగీత వృత్తికారుల జీవన వ్యథలను బొమ్మ కట్టిన కథ. గీత వృత్తిదారు కురుమయ్య వర్షంలో జారిపోతున్న తాడిచెట్టు ఎక్కలేక, ఎక్కడ జారిపడిపోతాననే భయం ఒకపక్క, ఎక్కడ తన నోటికాడ ముద్ద జారిపోతుందోననే బెదురు ఓ పక్క సతాయిస్తుండగా జరిగిన కథ. దినదినమూ కల్లు వాడకం తగ్గి, పల్లెల్లోనూ బ్రాందీషాపుల బెల్టు షాపులు పెచ్చుమీరడం, వస్తున్న తరం కల్లుగీతలో ఆదాయం లేకపోగా ప్రాణాపాయం వుండటం వల్ల కూడా ఈ వృత్తిని వదిలి, వేరే వృత్తులలోకో, నగరాలకో వలస పోవడం రికార్డు చేస్తుందీ కథ. తెలంగాణ మాండలికం అద్భుతంగా పలకడం, గీతకారుల వృత్తుల పనిముట్లు అవసరమైన చోట రావడం వల్ల కూడా ఈ కథ అచ్చంగా కల్లు వాసన వేస్తుంది."మొగుడు గడపదాటి తాళ్ళకు వోంగనే పెండ్లామ్ ముండ మోసినట్లే! గా తాళ్ళకు వోయిన మనిషి మల్ల ఇంటి గడప తొక్కినాకనే ఆయిమె ముత్తయిదువ యినట్లు.." అనడం రచయిత్రి సునిశిత పరిశీలనకు పరాకాష్ట. బహుజనుల వృత్తుల విధ్వంసం గురించి చర్చ పెట్టడం ఈ కథ సాధించిన అదనపు ప్రయోజనం.

"తానేం చేసినా, ఎలా ప్రవర్తించినా, తప్పు చేసినా సరే, ఏదో ఒక వంకతో దాన్ని సమర్థించుకోవడం మనిషి సహజ స్వభావం. ఈ సమర్థన ఒక్కోసారి ఏ స్థాయిలో వుంటుందంటే, అంతరాత్మ హెచ్చరిస్తున్నా దాని నోరు నొక్కేసి తాను చేస్తున్నది కరెక్టే అని తనను తాను నమ్మించుకునేంతగా.." అని 'మనిషిని నేను..' కథా రచయిత్రి సుజాత వేల్పూరి తన కథా పరిచయంలో చెప్పారు. అయితే ఈ విషయం చుట్టూ కథను అల్లడంలో గొప్ప నేర్పు ప్రదర్శించారు. మనిషి అంతరంగంలో ఏమేమి జరగడానికి ఆస్కారం వుందో.. నలుగురు గమనిస్తున్నప్పుడు ఒకలా, గమనించనపుడు ఒకలా ప్రవర్తించడం గురించి మనిషి మనసు లోతుల్లోకి తొంగిచూసి రాయడం ఈ కథలో కనిపిస్తుంది. నిజానికి 'మాయల దయ్యమ'యిన మనసుని, దాని ఆనుపానుల్ని, లోతుపాతుల్ని కనుక్కోని రాయడం కష్టం. పరిస్థితులు అనుకూలంగా వున్నప్పుడు మనలో వున్న అపరాధ భావం మాయమయ్యి, పరిస్థితికి అనుకూలంగా మన మనసు మనని మార్చేయడం చూస్తాం. అందుకు మనం వున్న పరిస్థితులు మీద నెపంతోసి సర్ది చెప్పుకునే స్థితి మనసు కల్పిస్తుంది. అటువంటి సున్నిత విషయం సమర్థవంతంగా నిర్వహించిందీ కథ. అయితే పనిమనిషి గిల్టీని ఇంకాస్త బలంగా చెప్పవచ్చని అనిపిస్తుంది. ఆమె వేసుకున్న ప్రాయశ్చిత్త ప్రణాళిక రచయిత్రి ప్రణాళికలా క్షణకాలం అనిపిస్తుంది.

సతీష్ చందర్ రాసిన 'ముల్లు' దళిత జీవితాల్లోంచి చొచ్చుకొచ్చిన కథ. దళిత ఈస్థటిక్స్, డైనమిక్స్ వున్న కథ. తిట్లూ, బూతులు దళిత జీవితంలో విడదీయరాని భాగం. అది ఎందుకో తెలియాలంటే దళితుల జీవన విధానం తెలియాలి. దళిత స్త్రీ జీవితం తెలియాలి. ఇంటా బయటా పెనుగులాట తెలియాలి. ఆ పెనుగులాట వెనుక వున్న ఆత్మరక్షణ తెలియాలి. నోరు మాత్రమే.. విసుగు జనించే నోరు మాత్రమే ఆయుధం. చేయి వేయలేని ముళ్ళకంపల్లా బతకటమే శీలరక్షణ. ఈ కథ ఆ వివరాలు చెపుతుంది. కళ్ళు చెమరుస్తుంది. 'ముల్లు' చుట్టూ గులాబీ లాంటి కథనం వున్న కథ ఇది.

'ఛాయ' మోహన్‌బాబు రాసిన 'చప్పుడు చేసే నిశ్శబ్దాలు' కథ భిన్నమైన నేపథ్యంతో కూడినది. జీవితంలో ఏర్పడిన ఖాళీలను పాటలతో పూరించుకునే ఒక వెలితి మనిషి ఆలోచనలు ఈ కథ. ఎన్ని వున్నా మనం కోరుకున్నది సరైన సమయంలో పొందలేకపోవడం ఒక పూడ్చలేని వెలితి. ఆ వెలితిని జ్ఞాపకాలతో, పాటలతో పూడ్చుకునే ప్రయత్నం చేసిన ఒక అనిశ్చిత మనస్కుడి అసంపూర్ణ కథ ఇది. ఇది మోహన్ బాబు తొలి కథ అంటే నమ్మడం కష్టం. పి.శ్రీనివాస్ గౌడ్ రాసిన 'నా కొడుకు లచ్చిమి' పశువులకు, మనుషులకు వున్న బాంధవ్యాన్ని మరో కోణంలో ఉదాత్తంగా చెబుతుంది. సూడిబర్రె తప్పిపోతే ప్రాణమే తప్పిపోయినట్టు కలవరపడిపోయిన రవణమ్మ, అది నాగిరెడ్డి కొష్టంలో హాయిగా వుండడం చూసి, దాన్ని సంతోషంగా అక్కడే వదిలిరావడం వెనుక కారణం చూసి మనసు చెమరుస్తుంది. రవణమ్మ ప్రేమకి, ముగింపు మాటలకి కళ్ళల్లో నీళ్ళూరతాయి. సహజంగా నడిచిన కథనం, జీవమున్న మాండలిక సంభాషణలు, కథలో హృదయాన్ని తాకే లయ కథను ఒక స్థాయిలో నిలిపాయి. ఒక మంచి కథ చదివామన్న అనుభూతితో సంకలనం ముగించామన్న తృప్తి కలుగుతుంది.

మొత్తంగా చూసుకుంటే.. కథ–2023 ఒక మంచి పఠనానుభవాన్ని ఇస్తుంది. ఇందుకు సంపాదకులు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్, సహాయ సంపాదకులు రమణమూర్తి గారలకు కృతజ్ఞతలు చెప్పాల్సిందే. ప్రతులకు : 98493 10560; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

– మాలతి
87121 06797

అలరించిన అల్లు రామలింగయ్య పరిషత్

'కళ కాసుల కోసం కాదు.. జన జాగృతి కోసం' కాన్సెప్ట్‌తో అల్లు రామలింగయ్య నాటక కళా పరిషత్ అండ్ వెల్ఫేర్ సొసైటీ– గుంటూరు వారు అక్టోబర్ 24 – 26 తేదీల్లో నిర్వహించిన నాటిక పోటీలు రసవత్తరంగా సాగాయి. ఆయా బృందాలు సమాజంలోని వివిధ సమస్యల్ని, రుగ్మతల్ని భిన్న కోణాల్లో ఆవిష్కరించి ప్రేక్షకుల్ని అలరించాయి, ఆలోచింపజేశాయి. పోటీ అంటే అనేకానేక అంశాలు సీరియస్‌గానే పరిగణనలోకి వస్తాయి కాబట్టి మరింత సాధనతో పాల్గొని ఉండాల్సిందనిపించిది కొన్ని ప్రదర్శనలు చూశాక.

మాతృత్వం ఫణంగా విశంఖల సుఖాల వైపు విచక్షణ రహితంగా పరుగులు తీస్తున్న యువతను.. 'ఒకరకంగా సమాజ పరిణామ క్రమాన్ని నిరోధించే దేశద్రోహులు'గా నిరసిస్తారు 'ఇది రహదారి కాదు' రచయిత భాస్కర చన్ద్ర. సంతానాన్ని కని, సాకే సానుకూల పరిస్థితులు దేశంలో లేవనే తర్కం అత్యంత అసంబద్ధమని మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్ కళాకారులు ఎస్.ఎం.బాషా దర్శకత్వంలో ఎండగట్టారు. అత్యున్నత వ్యక్తిత్వానికి, ధైర్యసాహసాలకు ప్రతీక 'సముద్రాలు'ను వ్యభిచారిణిగా చూపడం అవసరమా అని కొందరు ప్రేక్షకులు ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ పట్టా తీసుకునే సందర్భంగా చేసే ప్రతిజ్ఞ మేరకు ప్రజానీకానికి వైద్యులు ఆరోగ్య సేవలందించాలని.. మరీ ముఖ్యంగా దుర్భర పరిస్థితుల్లో సతమతమయ్యే గ్రామీణ నిరుపేదల చెంతకు వైద్యాన్ని చేర్చాలనే సమున్నత ఆశయాన్ని ప్రబోధిస్తుంది 'చిగురు మేఘం'. కావూరి సత్యనారాయణ రచనను ఏపూరి హరిబాబు దర్శకత్వంలో అమరావతి ఆర్ట్స్, గుంటూరు వారు పండించారు. ప్రదర్శన పరంగా కాస్తంత గడబిడ చోటుచేసుకున్నట్టనిపించింది. బిడ్డల భవిష్యత్ కోసం.. తినీతినక ఎన్నో త్యాగాలు చేస్తున్న తల్లిదండ్రులు– తమ భవిష్యత్ కోసం అప్రమత్తమవ్వాల్సిన కాలమిదని హెచ్చరించారు రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు 'అనూహ్యం'లో. వారసత్వ సంపదను ముందే దక్కించుకోవడం కోసం బిడ్డలు కుట్ర పన్నడాన్ని దునుమాడి– స్వయంకృషితో ఆత్మగౌరవంగా బతికేందుకు ప్రయత్నించాలన్న చెంపపెట్టు సందేశాన్ని కత్తుల రామ్మోహన్ రావు దర్శకత్వంలో నటీనట సంక్షేమ సమాఖ్య, పాలకొల్లు కళాకారులు హృద్యంగా అందించారు. ప్రపంచీకరణ దుష్ప్రభావం కుటుంబ వ్యవస్థ సహా దాదాపు అన్ని వ్యవస్థల్నీ కుదేలు చేసిన నేపథ్యంలో.. స్వార్థ జీవనానికి అలవాటుపడిన యువత వృద్ధ తల్లిదండ్రుల్ని దూరంగా ఉంచుతున్న వైపరీత్యాన్ని 'కిడ్నాప్' కుటుంబ కథలో రచయిత సాంబశివరావు తీవ్రంగా నిరసించారు. ఆయన దర్శకత్వంలోనే ఉషోదయ కళానికేతన్, కట్రపాడు బృందం ఆకట్టుకుంది. 'ప్రపంచంలో దేనికైనా విలువ కట్టొచ్చేమో గానీ తల్లిదండ్రుల ప్రేమకు విలువకట్టలేం.. బిడ్డలకు దేవుడిచ్చిన వరం తల్లిదండ్రులు' వంటి సంభాషణలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నాయి. అమృతవర్షిణి మినహా ప్రధాన పాత్రధారులు డైలాగ్ డెలివరీ సౌండ్‌ను నియంత్రించుకుంటే ప్రేక్షకులు మరింత రిలీఫ్ ఫీలయ్యేవారు. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ప్రయోక్త పోలుదాసు శ్రీనివాసరావు నాటక రచయితగా, దర్శకుడిగా, నటుడిగా తనను తాను రుజువుచేసుకున్న యువ కళాకారుడే. కానీ, ఏమైందో మరి 'నిశి'ని మాత్రం సబ్జెక్టుపరంగా.. కనీస తర్కానికి సైతం నిలవని ఒకటి, రెండు అసంబద్ధ సన్నివేశాలతో, అపహాస్య సంభాషణలతో అభిమానులకు ఆవేదన మిగిల్చారు. భర్త తనకు తగిన సమయం కేటాయించడం లేదు అనే ఏకైక 'సాకు'తో పాతాళానికి దిగజారిన గృహిణి– ఒరకంగా తనకూ ఈ దుష్పరిణామంలో భాగం ఉన్నట్టేనని భర్త సూక్తి ముక్తావళితో క్షమాగుణం ప్రదర్శించడం ఈ నాటిక ప్రధాన ఇతివృత్తం. ఇద్దరి రేచీకటి సమస్యనూ దాచి.. పెళ్లిచేసిన అనంతరం మొదటి రోజే గుట్టు రట్టయిన ఉదంతాన్ని 'దొందూ దొందే' నాటికగా హాస్యభరితంగా ప్రదర్శించారు భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ, విశాఖపట్నం కళాకారులు. రచయిత, దర్శకుడు ఎస్.డేవిడ్‌రాజ్ ప్రధానపాత్రలోనూ రాణించారు. 'తరమెల్లి పోతున్నదో..' నాటికను కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్, గుంటూరు వారు ప్రదర్శించారు. రచన, దర్శకత్వం: బి రామకష్ణ.



'ఇది రహదారి కాదు'లో ఓ ఆసక్తికర సన్నివేశం. (ఉత్తమ ప్రదర్శన)



చిగురు మేఘంలో ఒక దృశ్యం (ఉత్తమ ద్వితీయ ప్రదర్శన)

మరింత సమన్వయంతో..

నాటకాన్ని బతికించే పేరిట సాగుతున్న పరిషత్తుల పరంపరలో.. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చిన 'అల్లు రామలింగయ్య' టీమ్ కృషి అభినందనీయం. అయితే నిర్వహణలో మరింత సమన్వయం సాధించాల్సుందని సీనియర్ కళాకారులు, పరిషత్ నిర్వహణలో అనుభవజ్ఞులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా సమయపాలనలో మరింత నిబద్ధతగా ఉంటే బాగుండేది. స్టేజ్ మైకులు ఇంకా పర్ఫెక్ట్‌గా పనిజేసేలా చూస్తే ప్రేక్షకులు మరింత సంతృప్తి చెందేవారు. ప్రధాన ఫ్రంట్ కర్టెన్ సుమారు అడుగున్నర ఎత్తులో.. పైన దాదాపు అంతే కిందకు ఏర్పాటు చేయడం అసంబద్ధంగా ఉంది. నాటికల ఎంపిక విషయంలో మరింత నిక్కచ్చిగా వ్యవహరించి వుండాల్సింది. ఏమైనా నిర్వాహకుల కాన్సెప్ట్, కషి అభినందనీయం.

ఫలితాలు : ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ దర్శకత్వం : ఇది రహదారి కాదు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, ఉత్తమ రచన : చిగురు మేఘం. జ్యూరీ ప్రదర్శన : అనూహ్యం. ఉత్తమ నటుడు: ఎం.వి.రాజర్షి (అనూహ్యం), ఉత్తమ నటి: సురభి లలిత (నిశి), ఉత్తమ ప్రతినాయకుడు : ఎన్. వెంకటేశ్వరరావు (కిడ్నాప్), ఉత్తమ హాస్యనటుడు: ఎస్ డేవిడ్ రాజ్ (దొందూ దొందే). న్యాయ నిర్ణేతలు: షేక్ అబ్దుల్ రజాక్, ఎ.వి.శివయ్య.

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ పాత్రికేయులు,
99126 15747

మానస చామర్తికి ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ యువ పురస్కారం

మా కుమారుడు ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ స్మృత్యర్థం ఏర్పాటైన 'ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ జాతీయ యువ పురస్కారం' –2024కు సాఫ్ట్ వేర్ ఇంజనీర్, యువ రచయిత్రి, విమర్శకురాలు, కథా రచయిత్రి మానస చామర్తి ఎంపికయ్యారు. మానస చామర్తి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేసి, ప్రస్తుతం బెంగళూరులోని ఇన్ఫోసిస్‌లో ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. 2015లో 'పరవశ' పేరుతో కవితా సంపుటి తెచ్చారు. ఈ సంపుటికి ఇస్మాయిల్ పురస్కారం పొందారు. 'నాన్న' ప్రధాన వస్తువుగా వచ్చిన బృహత్సంకలనానికి సంపాద వర్గ సహకారం అందించారు. 'మధుమానసం' పేరిట బ్లాగు నిర్వ హిస్తున్నారు. త్వరలో అనంతపురం లో జరిగే సభలో ఈ అవార్డు కింద పది వేలు, షీల్డుతో సత్కారం ఉంటుంది.

– డా. ఉమ్మడిశెట్టి రాధేయ

రచనలకు ఆహ్వానం

జర్నలిస్టు, కవి, రెవిన్యూ అధికారిగా సుపరిచితమైన సోమేపల్లి వెంకట సుబ్బయ్య గారి వర్ధంతి సందర్భంగా వెలువరించబోయే ప్రత్యేక సంకలనానికై రచనలను ఆహ్వానిస్తున్నాం. సోమేపల్లితో వున్న అనుబంధాల్ని, సందర్భాలను వ్యాసాలుగా, కవితలుగా చేసిన రచనలను, ఫొటోలను నవంబరు 20 లోపు ఈమెయిల్: ౦జం౦శీఎవజూఖశ్రీశ్రీఱఎస్త్రఝఱశ్రీ.ఱశీఎ లేదా 8074779202 నెంబరుకు వాట్సాప్ లేదా రమ్యభారతి, పి.బి.నెం.5, 11–57/1–32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ–520001 చిరునామాకు పంపగలరు.

– సోమేపల్లి లిటరరీ ఫౌండేషన్

కళింగాంధ్ర దళిత, మత్స్యకార కవితల కోసం ...

కళింగాంధ్ర ప్రాంతానికి చెందిన కవులు రాసి ఇప్పటికే అచ్చైన దళిత, మత్స్యకార కవితలతో విడివిడి సంకలనాలను 'చంపావతి ప్రచురణలు'గా నా సంపాదకత్వంలో తీసుకొస్తున్నా ను. నా దగ్గరున్న కవితలు కాకుండా నా దృష్టికి రాని కవితల కోసం ఈ ప్రకటన. మీ వద్ద వున్న పై విభాగాలకు చెందిన కవితలను, ఆయా కవితలు అచ్చైన వివరాలను champaavathi@gmail.com ఐడికి పంపించాల్సిందిగా కోరుతున్నాను. ఫోన్ నంబర్లు 96764 93680, 95056 46046.

– బాల సుధాకర్

రాయలసీమ నాటక రచనాపోటీ

ఎనిమిదవ రాయలసీమ మహా కవిసమ్మేళనం 'రాయలసీమ సాంస్కృతిక వేదిక' ఆధ్వర్యంలో 'రాయలసీమ రత్నాలు' పేరున నిర్వహిస్తున్నాం. వివిధ రంగాల రాయలసీమ ప్రముఖులపై కవితలు కవితలు రాయగలరు. తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి, మెట్టుపల్లి సుదర్శనరెడ్డిల స్మారకంగా డిసెంబరులో కవిసమ్మేళనం జరుగుతుంది. ఈ కార్యక్రమం వివివరాల కోసం 99639 17187 నెంబరును సంప్రదించగలరు.

రాయలసీమ సమాజం – జీవ సంస్కృతి నేపథ్యంగా ఏకాంకిక, నాటిక, నాటక రచనాపోటీలను డా.ఎం.వి రమణారెడ్డి స్మారకంగా నిర్వహిస్తున్నాం. డిసెంబరు 22 లోపు రచనలను పంపాలి. మొత్తం రూ.15 వేల నగదు బహుమతులు న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు అందచేస్తాము. వివరాలకోసం 99639 17187 సంప్రదించగలరు.

– డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి

3న 'చారల పిల్లి' ఆవిష్కరణ

వేంపల్లె షరీఫ్ రాసిన 'చారల పిల్లి' కథల పుస్తకం ఆవిష్కరణ నవంబరు 3వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని బుక్ ఫెస్టివల్ కాన్ఫరెన్సు హాల్లో జరుగుతుంది. పముఖ కవి ఖాదర్ మొహినుద్దీన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. వక్తలుగా కాట్రగడ్డ దయానంద్, మల్లీశ్వరి, అరుణాంక్ లత, బత్తుల ప్రసాద్, అనిల్ డానీ పాల్గొంటారు.

– సూఫీ పబ్లికేషన్స్, విజయవాడ.

ఔషధ, సుగంధ మొక్కల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి-నల్లజర్ల

హైదరాబాదు బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన సంస్థ ఆవరణంలో నవంబర్ 12 నుంచి 14 వరకూ ఔషధ, సుగంధ మొక్కల సాగుపై శిక్షణ ఇవ్వనున్నట్లు చీఫ్ సైంటిస్ట్ జి.డి.కిరణ్‌బాబు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే వారు రూ.3,500 రుసుమును నవంబరు 8లోగా కట్టి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాత్రికి వసతి సదుపాయం లేదన్నారు. వివరాలకు 9491043252, 94934 08227 నెంబర్లను లేదా https://www.cimap. res.in/pages/Training.asp వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

లారీ ఢీకొని 50 జీవాలు మృతి

ప్రజాశక్తి - ఉరవకొండ (అనంతపురం)

అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణ శివారులో 42 వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గొర్రెల మందపై లారీ దూసుకెళ్లింది. దీంతో 50 గొర్రెలు మృతి చెందాయి. మరో 30 గాయపడ్డాయి. అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు కర్నాటక రాష్ట్రం హగిరి ప్రాంతానికి చెందిన నాగరాజు, మంజునాథ్ తదితరులకు సంబంధించిన గొర్రెలను ఆదివారం తెల్లవారుజామున మేత కోసం ఉరవకొండ సమీపంలో తోలుకెళ్తున్నారు. ఆ సమయంలో అనంతపురం వైపు నుంచి హోస్పేట వైపు లోడుతో వస్తున్న లారీ ఉరవకొండ సమీపంలో మందపై దూసుకెళ్లింది. దీంతో 50 గొర్రెలు మృతి చెందాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పశువైద్యులు సంఘటనా స్థలంలోనే మృతి చెందిన వాటికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ప్రమాదంలో తమకు సుమారు రూ. 5 లక్షలు నష్టం వాటిల్లినట్లు గొర్రెల కాపరులు వాపోయారు. ఈ ప్రమాదంపై లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యుదాఘాతానికి గురై మహిళా రైతు మృతి చెందిన ఘటన అనంతపురం జిల్లా విడపనకల్లు మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం పరిధిలోని హవళిగి గ్రామానికి చెందిన వరలక్ష్మి (36), పెన్నయ్య దంపతులకు విడపనకల్లులో ఉన్న ఐదెకరాల పొలంలో మిరప పంట సాగు చేశారు. రోజు మాదిరిగానే ఉదయం పొలం పనులకు వెళ్లారు. పొలానికి నీళ్లు పెట్టడానికి వరలక్ష్మి స్టార్టర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మధ్యతరగతి కునారిల్లుతోంది!

- ఎదుగూ బొదుగూ లేని ఆదాయం, వినియోగం



న్యూఢిల్లీ : గత కొంతకాలంగా మధ్యతరగతి ప్రజలలో ఆదాయం, వినియోగం... ఈ రెండూ ఎదుగూబొదుగూ లేకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా స్థిరంగా ఉంటున్నాయని నెస్లే ఇండియా సిఎండి సురేష్ నారాయణన్ చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కంపెనీ అమ్మకాల్లో వృద్ధి బాగా పడిపోయిందని ఆయన తెలిపారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న తమ వంటి వినియోగ వస్తువుల పరిశ్రమలన్నీ మధ్యతరగతి ప్రజలపైనే ఆధారపడతాయని, అయితే ఇప్పుడు ఆ తరగతి కుంచించుకుపోతోందని అన్నారు. కంపెనీ త్రైమాసిక వృద్ధి గణాంకాలను విడుదల చేసిన సురేష్ నారాయణన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అనేక త్రైమాసికాలుగా ఈ మాంద్యం కొనసాగుతూనే ఉన్నదని, ఇది ఆసాధారణమని ఆయన చెప్పారు. ఏషియన్ పెయింట్స్ సిఇఒ అమిత్ సింగ్లే కూడా విశ్లేషకులు, మదుపుదారులతో మాట్లాడుతూ జిడిపి గణాంకాలపై సందేహాలు వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో వివిధ రంగాల పరిస్థితులను అవి ప్రతిబింబించడం లేదని తెలిపారు. అయితే ఆ మరునాడే కంపెనీ ఒక ప్రకటన చేస్తూ తమ సిఇఒ మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చింది. ఏదేమైనా కొంతకాలంగా చాలా మంది సీనియర్ కార్పొరేట్, మార్కెట్ విశ్లేషకులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినియోగ వృద్ధిపై వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. పండుగల సీజన్ వచ్చిందంటే నూతన వాహనాల కొనుగోలుపై ప్రజలు బాగా ఆసక్తి చూపుతుంటారు. అయితే దసరా వెళ్లి, దీపావళి వస్తున్నా మధ్యతరగతి జీవులు పెద్దగా వాటి కొనుగోలుపై ఆసక్తి చూపడం లేదు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దేశంలో వాణిజ్య వాహనాల అమ్మకాలు 4-6 శాతం తగ్గాయి. ద్విచక్ర వాహనాల అమ్మకాలు కొంత మేర పెరిగినప్పటికీ 2018 స్థాయికి చేరలేదు. అధికారులు మాత్రం దీనికి వింత భాష్యం చెబుతున్నారు. మధ్యతరగతి ప్రజల ఆదాయం పెరుగుతోందని, ద్విచక్ర వాహనాలకు బదులుగా వారు ఎస్‌యువిలను కొంటున్నారని వారు అంటున్నారు. ఈ వాదనను మారుతి సుజుకీ లిమిటెడ్ చైర్మన్ ఆర్‌సి భార్గవ తోసిపుచ్చారు. ఎస్‌యువి అమ్మకాలు పెరుగుతున్న మాట నిజమేనని, అయితే సంపన్నులే వాటిని ఎక్కువగా కొంటున్నారని, మధ్యతరగతి వారు ఇప్పటికీ ఆదాయం పెరగక ఇబ్బంది పడుతూనే ఉన్నారని ఆయన చెప్పారు. గత దశాబ్ద కాలంగా గ్రామీణ ప్రజల ఆదాయం, వినియోగం స్థిరంగానే ఉంటున్నాయి. జిడిపి వృద్ధి 7 శాతం దాటుతుందన్న అంచనాలు ఉన్నప్పటికీ కొన్ని నెలలుగా పట్టణ వినియోగంలో ఒత్తిడి పెరుగుతోంది. సుమారు దశాబ్ద కాలంగా వార్షిక వినియోగ వృద్ధి 3.5 శాతంగానే ఉంటోందని, ఇది జిడిపి వృద్ధిలో సగమని ఎన్‌ఎస్‌ఎస్‌ఓ సర్వే చెబుతోంది. ఆదాయం, వినియోగం మాదిరిగానే గ్రామీణ ప్రాంతాల్లో పొదుపు కూడా తగ్గిపోతోంది.

క్లాప్ డ్రైవర్ల మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి-కాకినాడ



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ కాకినాడలో క్లాప్ వాహన డ్రైవర్స్ చేస్తున్న ఆందోళన ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. వాహనాల యార్డ్ వద్ద మోకాళ్లపై నిలుచుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, నగర కన్వీనర్ మలకా వెంకటరమణ మాట్లాడారు. మూడు రోజుల నుంచి క్లాప్ డ్రైవర్లు ఆందోళన చేస్తున్నా మున్సిపల్ అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదన్నారు. సోమవారం నుంచి పోరాటం మరింత ఉధృతం చేస్తున్నట్లు తెలియజేశారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వచ్చి ధర్నా చేస్తామన్నారు. జీతాల సమస్య త్వరగా పరిష్కారం కాకపోతే సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. జిఒ నెంబరు 36 ప్రకారం క్లాప్ వాహన డ్రైవర్లకు కనీస వేతనం రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, గంగాధర్, టి.శ్రీను, భైరవ స్వామి, కె.దుర్గ బాబు, ఎం.రాజు, వై.దుర్గాప్రసాద్, ఎన్.సూరిబాబు, ఆర్.పూర్ణ సతీష్, వి.అరుణ్‌కుమార్, ఆర్.వెంకటేష్, డి.రాము, జె.కృష్ణమూర్తి, జెవివి రమణ తదితరులు పాల్గొన్నారు.

శరద్‌పవార్ పార్టీ 3వ జాబితా విడుదల

- పార్టీలో నటి స్వర భాస్కర్ భర్త చేరిక

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు శరద్ పవార్ సారథ్యంలోని ఎన్‌సిపి (ఎస్‌సిపి) మరో తొమ్మిదిమంది అభ్యర్థులను ఆదివారం ప్రకటించింది. ఆ పార్టీ మూడో జాబితా విడుదల చేసింది. మొత్తం 76 మంది అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

ఆ పార్టీలో బాలీవుడ్ నటి స్వర భాస్కర్ భర్త ఫహద్ అహ్మద్ ఆదివారం చేరారు. ఆయనకు అణుశక్తి నగర్ టిక్కెట్‌ను పార్టీ కేటాయించింది. ఇక్కడ ఎన్‌సిపి అజితి పవార్ అభ్యర్థిగా సనా మాలిక్ పోటీ చేస్తున్నారు. సమాజ్‌వాదీ పార్టీ మహారాష్ట్ర ప్రదేశ్ యువజన విభాగమైన సమాజ్‌వాది యువజన సభ రాష్ట్ర అధ్యక్షుడిగా ఫహద్ అహ్మద్ ఉన్నారు. ఇరు పార్టీలు చర్చించుకుని, ఆయనకు ఎన్‌సిపి (ఎస్‌సిపి) టికెట్ కేటాయించాయి. తనను అభ్యర్థిగా నిలబెట్టేందుకు అఖిలేష్ యాదవ్‌కు విజ్ఞప్తి చేసిన శరద్ పవార్‌కు ఫహద్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ, ఎన్‌సిపి ఎస్‌సిపి రెండూ ఒకే కుటుంబమ అన్నారు. మహారాష్ట్ర ప్రజలు ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దెదించాలని బలంగా అనుకుంటున్నారని చెప్పారు. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి కూడా ఆదివారం మూడో జాబితతా విడుదల చేసింది. నలుగురి పేర్లను ప్రకటించింది. వీరిలో ఇద్దరు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపితో తలపడనున్నారు.



ఊరూ.. వాడా..'బెల్టు'..!

- విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపుల ఏర్పాటు
- ఒక్కో షాపునకు రూ.లక్ష వసూలు
- వీటి కేటాయింపు కూడా ఎమ్మెల్యేలు, స్థానిక నేతల కనుసన్నల్లోనే
- ప్రేక్షకపాత్రలో ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మద్యం అమ్మకాలకు గేట్లు ఎత్తేశారు. ఒక అధికారిక దుకాణం పరిధిలో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు వెలిసిపోతున్నాయి. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో మద్యం ఏరులై పారే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హాయాంలో మద్యంతోపాటు నాటుసారా అమ్మకాలు విచ్చలవిడిగా సాగగా, కూటమి ప్రభుత్వంలో ఇంటింటికీ మద్యం అన్నట్లు పరిస్థితి తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ తీరుపై జనాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గత పాలకులు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నడిపించారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా ధరలు విపరీతంగా పెంచేసి మద్యం అమ్మకాలను జోరుగా సాగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సైతం మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగించేందుకు గేట్లు ఎత్తేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత మద్యం విధానంలో మార్పులు తెచ్చారు. గతంలో ప్రభుత్వం ఆధ్యర్యంలో మద్యం అమ్మకాలు సాగగా, ఇప్పుడు ప్రయివేటుకు అప్పగించారు. ఈ నెల 16వ తేదీ నుంచి కొత్త షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభమయ్యాయి. కొత్తగా మద్యం దుకాణం దక్కించుకున్నవారు నాన్ రిఫండబుల్ ఫండ్ కింద రూ.రెండు లక్షలు చెల్లించారు. రెండేళ్లలో రూ.60 లక్షలు లైసెన్స్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంది. దీంతో పెట్టిన సొమ్ము రాబట్టుకోవడంతోపాటు భారీగా లాభాలు ఆర్జించేందుకు వ్యాపారులు, నేతలు ప్రణాళికలు రచించారు. ప్రభుత్వం లాటరీ ద్వారా కేటాయించిన మద్యం దుకాణ పరిధిలో పెద్దఎత్తున బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్న పరిస్థితి కన్పిస్తోంది.

బెల్టుషాపునకు రూ.లక్ష వసూలు

గ్రామాల్లో ప్రాంతాలవారీగా ఈ బెల్టు షాపులు ఏర్పాటు చేస్తున్నారు. బెల్టుషాపులకు సైతం పెద్దఎత్తున పోటీ సాగుతోంది. ఎంఎల్‌ఎ, స్థానిక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ ప్రక్రియ సాగుతోంది. బెల్టుషాపు ఎవరికివ్వాలో ప్రజాప్రతినిధులే నిర్ణయిస్తున్న పరిస్థితి ఉంది. బెల్టుషాపు కేటాయించిన వారినుంచి రూ.లక్ష వసూలు చేస్తున్నారు. ఒక అధికారిక మద్యం దుకాణం పరిధిలో తక్కువగా లెక్కించినా 20కుపైగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యక్తులు క్వార్టర్ బాటిల్‌కు రూ.20 నుంచి రూ.30 అదనంగా ధర వసూలు చేసేందుకు నిర్ణయించారు. వీరికి ముందుగా 40 నుంచి 50 వరకూ మద్యం బాటిల్స్ ఇస్తున్నారు. అమ్మకాలను బట్టి బాటిల్స్ అందించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంతోపాటు జనసేన ప్రజాప్రతినిధులు ఉన్నచోట్ల ఈ బెల్టుషాపుల ఏర్పాటు విషయంలో టిడిపి, జనసేన నేతల మధ్య రాజకీయ పోరు సాగుతుండటం విశేషం. బెల్టు షాపుల ఏర్పాటుతో మద్యం ప్రతి వీధికీ, ప్రతి పేటకు చేరుతున్న పరిస్థితి ఉంది. జనాలను తాగుబోతులుగా మార్చే ప్రయత్నం స్పష్టంగా కన్పిస్తోంది. బెల్టు దుకాణాల ఏర్పాటుపై ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. లాటరీ ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తికి తక్కువగా లెక్కించినా రూ.కోటి వరకూ ఖర్చవుతుందని, సొమ్ము రాబట్టుకోవాలంటే బెల్టుషాపులు తప్పనిసరని ప్రజాప్రతినిధులు మాట్లాడుతుండటం గమనార్హం. 2014-19 టిడిపి ప్రభుత్వ హాయంలోనూ మద్యం బెల్టుషాపులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లో ప్రతిపక్ష వైసిపి బెల్టు షాపులను ఆయుధంగా చేసుకుని ప్రచారం చేసింది. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమికి మద్యం బెల్టుషాపులు ముఖ్యకారణంగా చెప్పొచ్చు. మళ్లీ ఇప్పుడు సైతం అదే తరహాలో కూటమి ప్రభుత్వం బెల్టుషాపులను ప్రోత్సహిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మరో 15 సి-295 విమానాల కొనుగోలు

న్యూఢిల్లీ : మరో 15 సి-295 విమానాల కొనుగోలు చేయాలని భారత్ నిర్ణయించింది. గుజరాత్‌లోని వడోదరాలో టాటా ఎయిర్ క్రాఫ్ట్ కాంప్లెక్స్‌ను స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్‌తో కలిసి ప్రధాని నరేంద్రమోడీ సోమవారం ప్రారంభిస్తారు. భారతదేశంలో సైనిక విమానాల కోసం ప్రైవేట్ సెక్టార్ ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఎఎల్) అవుతుందని, ఇది తయారీ నుంచి అసెంబ్లింగ్, టెస్ట్, క్వాలిఫికేషన్ వరకూ ఉపయోగపడు తుందని ప్రధాన మంత్రి కార్యాలయం పేర్కొంది. ఇప్పటికే కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 56 ఎయిర్ బస్‌లను కొనుగోలు చేయాల్సి ఉంది. మరో 15 అదనంగా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వీటిలో 12 మనదేశంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టిఎఎస్ఎల్) తయారు చేస్తుంది.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ సూచీలో

అట్టడుగున భారత ర్యాంకు

- 180 దేశాలలో 176వ స్థానం

న్యూఢిల్లీ : ప్రపంచ ప్రకృతి పరిరక్షణ సూచీ (గ్లోబల్ నేచర్ కన్జర్వేషన్ ఇండెక్స్) 2024లో భారత ప్రదర్శన దారుణంగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా 180 దేశాలకు ఇందులో ర్యాంకులు కేటాయించగా.. భారత్ 176వ స్థానంలో ఉన్నది. 100కు గానూ 45.5 స్కోర్ మాత్రమే సాధించిన భారత్ అట్టడుగున నిలిచింది. ఈ జాబితాలో భారత్ తర్వాత స్థానాల్లో కిరిబాటి(180), టర్కీ(179), ఇరాక్ (178), మైక్రోనేషియా(177) దేశాలున్నాయి.

భూమి నిర్వహణ, జీవ వైవిధ్యం, పాలన, సామర్థ్యం, భవిష్యత్తు పోకడలు ఎదుర్కొంటున్న ముప్పులు వంటి అంశాలను ఈ సూచికలో పరిగణలోకి తీసుకుంటారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షను సమతుల్యం చేయటంలో ప్రతీ దేశం సాధించిన పురోగతిని ఇందులో అంచనా వేస్తారు. ఇజ్రాయెల్‌కు చెందిన బెన్-గురియన్ యూనివర్సిటీ ఆఫ్ నెగెవ్, లాభాపేక్షలేని వెబ్‌సైట్ బయోడీబీలు దీనిని రూపొందించాయి. జీవ వైవిధ్యానికి పెరుగుతున్న ప్రమాదాలు, భూమి అసమర్థ నిర్వహణ కారణంగా భారత్ అత్యల్ప ర్యాంకుకు కారణమని సూచీ పేర్కొన్నది. పట్టణ, పారిశ్రామిక, వ్యవసాయ అవసరాల కోసం భూమార్పిడి 53 శాతానికి చేరినందున స్థిరమైన భూ వినియోగ పద్దతులు అవసరమని పరిశోధకులు చెప్పారు.



వ్యవసాయం, పట్టణీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధితో ఆవాసాలు కోల్పోవటం వంటి అనేక అంశాలు దేశ జీవ వైవిధ్యానికి ప్రమాదాలు కలిగిస్తున్నాయని కూడా వారు అన్నారు.

దేశంలో 2001 నుంచి 2019 మధ్య కొనసాగుతున్న అటవీ నిర్మూలన కారణంగా 23,300 చదరపు కిలోమీటర్లలో చెట్ల స్థలం పోయిందని పేర్కొన్నది. భారత్ భయంకరమైన జీవ వైవిధ్య సవాళ్లతో పాటు మంచి అవకాశాలనూ ఎదుర్కొంటున్నదని పరిశోధకులు చెప్పారు. 1970ల చివరి నుంచి రెట్టించిన జనాభా కారణంగా దేశ జీవవైవిధ్య సంపద నిరంతరం ముప్పులో ఉన్నదని వారు హెచ్చరిస్తున్నారు. స్థిరమైన అభివృద్ధికి తోడ్పడే నిబంధనలను తయారు చేయటం, పర్యావరణ పరిరక్షణకు నిధుల కేటాయింపు, సమర్థవంతమైన పరిరక్షణ చర్యలను ప్రోత్సహించటం ప్రభుత్వాల అంకితభావంపై ఆధారపడి ఉంటుందని పరిశోధకులు సూచిస్తున్నారు.

అదానీకి షాక్

- విద్యుత్ లైన్ ఒప్పందాన్ని సస్పెండ్ చేసిన కెన్యా

నైరోబీ : కెన్యాలో అదానీ గ్రూప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ట్రాన్స్‌మిషన్ లైన్లు సహా విద్యుత్ మౌలిక సదుపాయాల నిర్మాణం, నిర్వహణ కోసం ప్రభుత్వ రంగంలోని కెన్యా ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని కెన్యా హైకోర్టు సస్పెండ్ చేసింది. 30 ఏళ్ల కాలానికి సంబంధించిన ఒప్పందంపై ఈ రెండు కంపెనీలు ఈ నెల ప్రారంభంలో సంతకాలు చేశాయి. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూపులో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ కంపెనీ కూడా ఉంది. ఒప్పందాన్ని సవాలు చేస్తూ లా సొసైటీ ఆఫ్ కెన్యా దాఖలు చేసిన కేసుపై నిర్ణయం తీసుకునే వరకూ 736 మిలియన్ డాలర్ల అగ్రిమెంటును అమలు చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. ఒప్పందాన్ని రహస్యంగా చేసుకున్నారని, రాజ్యాంగం ప్రకారం దానికి విలువ లేదని కెన్యా లా సొసైటీ వాదిస్తోంది. రెండు కంపెనీలు తమ ఒప్పందంలో ప్రభుత్వానికి అర్థవంతమైన భాగస్వామ్యం కల్పించాల్సి ఉంటుందని, 2021వ సంవత్సరపు కెన్యా పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్ చట్టం ప్రకారం అది తప్పనిసరి అని తెలిపింది. చట్ట ప్రకారం ఆఫ్రికా దేశమైన కెన్యాలో ప్రయివేటు కంపెనీలు ప్రభుత్వ రంగ ప్రాజెక్టులను చేపట్టవచ్చు.

కాగా 30 ఏండ్ల పాటు నైరోబీ విమానాశ్రయ అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి కెన్యా ప్రభుత్వం, అదానీ గ్రూపునకు చెందిన మరో కంపెనీకి మధ్య కుదిరిన ప్రతిపాదిత ఒప్పందాన్ని కూడా లా సొసైటీ, మరికొన్ని గ్రూపులు న్యాయస్థానంలో సవాలు చేశాయి. ఈ ఒప్పందం ఆర్థికంగా లాభదాయకం కాదని, పైగా ఉద్యోగాలు కూడా పోతాయని సొసైటీ వాదించింది. దీనిపై గత నెలలో స్పందించిన న్యాయస్థానం తుది నిర్ణయం తీసుకునే వరకూ విమానాశ్రయ ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది.

ఉపాధి హామీ నమోదు లక్ష్యం నిర్ణయించడం అసాధ్యం

అది డిమాండ్ ఆధారిత పథకం

- లిబ్‌టెక్ నివేదికపై కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉపాధి హామీ డిమాండ్ ఆధారిత పథకమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటికీ కొనసాగుతున్నందున, వ్యక్తిగత రోజుల పనిని కచ్చితమైన లక్ష్యాన్ని నిర్ణయించడం సాధ్యం కాదని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పేర్కొంది. అయినప్పటికీ, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు స్థానికంగా అవసరాలకు అనుగుణంగా లేబర్ బడ్జెట్ రివిజన్ కోసం ప్రతిపాదనలు పంపొచ్చని తెలిపింది. ఇటీవల దేశంలో ఉపాధి హామీ జాబ్ కార్డులు తొలగింపు, పని తగ్గుదలపై లిబ్‌టెక్ సంస్థ నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం ఈ పథకం కింద ఉపాధి అవకాశాలు అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 184 కోట్ల నుంచి 154 కోట్ల వ్యక్తిగత పనిదినాలకు గణనీయంగా పడిపోయాయి. మొత్తం కార్మికులలో 6.7 కోట్ల (27.4 శాతం) మంది ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్) ద్వారా వేతనాలు పొందేందుకు అనర్హులని కూడా పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ స్పందించింది.

2006-07 నుంచి 2013-14 మధ్య మొత్తం వ్యక్తుల రోజులు 1,660 కోట్లుగా ఉన్నాయని, అయితే 2014-15 నుంచి 2024-25 మధ్య మొత్తం వ్యక్తుల రోజులు 2,923 కోట్లకు పెరిగాయని తెలిపింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదివారం ఉపాధి హామీ పథకం కింద నమోదు తగ్గుతోందని, డిమాండ్ ఆధారిత పథకంలో మొత్తం నమోదు కోసం లక్ష్యాలను నిర్ణయించడం సాధ్యం కాదని పేర్కొంది. ఆర్థిక సంవత్సరం ఇంకా కొనసాగుతోందని తెలిపింది. డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డిబిటి), ఆధార్ సీడింగ్‌పై ఉపాధి హామీ కార్మికుల ఆధార్ ఆధారంగా చెల్లింపులను నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసే ప్రధాన సంస్కరణ ప్రక్రియ ఎబిపిఎస్ అని మంత్రిత్వశాఖ పేర్కొంది. జాబ్ కార్డుల తొలగింపుపై, జాబ్ కార్డు వెరిఫికేషన్ అనేది ఉపాధి హామీ కింద నిరంతర ప్రక్రియ అని, డి-డూప్లికేషన్ సాధనంగా ఆధార్ నెంబర్ సహాయంతో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ కసరత్తును నిర్వహిస్తాయని పేర్కొంది. 2023-24లో రాష్ట్రాలు తొలగించిన మొత్తం జాబ్ కార్డుల సంఖ్య 1.02 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో అక్టోబరు 26 నాటికి ఆ సంఖ్య 32.28 లక్షలని పేర్కొంది.

చిట్టీల పేరుతో రూ.30 కోట్లకు టోకరా!

- 500 మందికిపైనే బాధితులు
- నిర్వాహకుడి కాళ్లపై పడి బోరుమన్న మహిళలు
- మోసపోయిన కూలీలు, ఉద్యోగులు, వ్యాపారులు
- పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు
- నెల రోజుల నుంచి భోగాపురాన్ని కుదిపేస్తున్న వ్యవహారం

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

చిట్టీలు, అప్పుల వ్యవహారం భోగాపురాన్ని నెల రోజుల నుంచి కుదిపేస్తోంది. ఏ నోట విన్నా ఈ చిట్టీలు, అప్పుల మాటే వినబడుతోంది. కష్టపడి రూపాయి రూపాయి సంపాదించి కుమార్తె వివాహానికో, లేక పిల్లల చదువుకో, ఇల్లు కట్టుకోవడానికో, ఇంకేదేనికైనా పనికొస్తాయనే ఉద్దేశంతో చిట్టీలు వేసిన వారంతా బోరుమంటున్నారు. అప్పులిచ్చిన వారంతా లబోదిబోమంటున్నారు. పెద్ద మనుషుల చుట్టూ తిరిగి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇలా మోసపోయిన బాధితులు సుమారు 500 మంది పైనే ఉన్నారు. ఒక్కొక్కరు రూ.5 లక్షల నుంచి సుమారు రూ.50 లక్షల వరకు మోసపోయారు. ఇలా మోసపోయిన సొమ్ము సుమారు రూ.30 కోట్లపైనే ఉంటుందని బాధితులు చెబుతున్నారు.

విజయనగరం జిల్లా భోగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నమ్మకంగా గత పదేళ్ల నుంచి చిట్టీలు వేస్తున్నాడు. నమ్మకంగా ఉంటూ చిట్టీలు పాడిన వారికి సొమ్ము ఇచ్చేవాడు. లాభాలు కూడా భారీగా వచ్చేవి. దీంతో, భోగాపురంతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన రోజువారీ కూలీల నుంచి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే చాలామంది ఆయన వద్ద చిట్టీలు వేయడం ప్రారంభించారు. బంధువులకు సైతం చెప్పడంతో వారు కూడా ఇక్కడే చిట్టీ కట్టేవారు. అక్కడ నుంచి చిట్టీలు పాడిన వారికి వడ్డీని నిర్వాహకుడు ఎరగా వేశాడు. ఎవరైతే చిట్టీలు పాడుతారో, వారికి సొమ్ము ఇవ్వకుండా ఆ సొమ్ముకు వచ్చే వడ్డీతో మరో చిట్టీ వేయించేవాడు. వడ్డీలు వస్తాయి.. చిట్టీలు పెరిగి సొమ్ము రెట్టింపు అవుతాయని ఆశ చూపించేవాడు. ఇంకొంతమంది నుంచి అప్పులు వాడడం మొదలు పెట్టాడు. చిట్టీలు వేసిన వ్యక్తి ఖరీదైన జీవితానికి అలవాటు పడ్డాడు. ఒక ఉపాధ్యాయుడితోపాటు మరో ఇద్దరు వ్యక్తులు చిట్టీలను ఆయన వద్దే వేశారు. చిట్టీలు తక్కువకు పాడేసి తిరిగి చెల్లించేందుకు అప్పులు చేశారు. అప్పుల్లో కూరుకుపోయామని, ఇప్పట్లో చెల్లించలేమనివీరు ముగ్గురు చేతులెత్తేశారు. చిట్టీల నిర్వాహకుడు ఇదే అదునుగా తానూ చెల్లించలేనంటూ ఈ నెల పదో తేదీన ఒక లేఖ రాసి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

కాళ్లపైపడి బోరుమన్న మహిళలు

ఆస్పత్రి నుంచి వచ్చిన తరువాత చిట్టీలు వేసిన వ్యక్తిని గ్రామంలోని పెద్ద మనుషుల సమక్షంలో పిలిపించి బాధితులు మాట్లాడారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున హాజరైన బాధితులు ఆ వ్యక్తి కాళ్లపై పడి తమ సొమ్ము తిరిగి ఇచ్చేయాలంటూ బోరుమన్నారు. కష్టపడి పైసా పైసా సంపాదించి చిట్టీలు కట్టామని, తమను మోసచేయొద్దని, సొమ్ము తిరిగి ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. కానీ, ఆ వ్యక్తి మాత్రం చలించకలేదు. తాను అప్పుల్లో కూరుకుపోయానని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని కొంతమంది బాధితులు అంటున్నారు. మరికొంతమంది మాత్రం హైదరాబాద్‌లో ఆస్తులు కొనుగోలు చేశాడని చెబుతున్నారు. పెద్ద మనుషులు రంగంలోకి దిగడంతో వీరు ఏ మేరకు బాధితులకు న్యాయం చేస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది. అందుకనే సంబంధిత వ్యక్తిపై నేటికీ ఒక్కరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని పలువురు చెబుతున్నారు.


బాధితుల్లో కూలీలు, చిరుద్యోగులే అధికం

చిట్టీలు వేసిన వ్యక్తి చేతిలో మోసపోయిన వారిలో రోజువారి కూలీలు, చిరుద్యోగులే ఎక్కువ మంది ఉన్నారు. టైలరింగ్ చేసే ఓ మహిళ పదేళ్ల నుంచి రూపాయి రూపాయి కూడబెట్టి చిట్టీలు వేసింది. ఇలా సుమారు రూ.37 లక్షల వరకు మోసపోయింది. పలువురు ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు అనేకమంది సుమారు రూ.5 లక్షల నుంచి 50 లక్షల వరకు చిట్టీలు, అప్పుల పేరుతో ఈ వ్యక్తి చేతిలో మోసపోయారు. గ్రామంలో చాలామంది లక్షల్లోనే రూ.అప్పులు ఇచ్చారు.

ఆత్మహత్యకు ప్రయత్నించిన ముందురోజు కూడా ఓ వ్యక్తి నుంచి రూ.20 లక్షలు అప్పు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఇలా మోసపోయిన బాధితులు 500 మంది పైనే ఉంటారని, ఆ మొత్తం దాదాపు సుమారు రూ.30 కోట్లకు పైగా ఉంటుందని అంటున్నారు.

డెప్సాంగ్, డెమ్‌చోక్‌లో బలగాల ఉపసంహరణ త్వరలో పూర్తి

- విదేశాంగమంత్రి జైశంకర్



ముంబై: తూర్పు లడ్డాఖ్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి పెట్రోలింగ్‌పై చైనా-భారత్ చర్చలు, ఇటీవల ఇరుదేశాల మధ్య కుదిరిన ఒప్పందం పురోగతిని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. ఒప్పందం ప్రకారం 2020 నాటి పరిస్థితిని పునరుద్ధించాలని నిర్ణయించామని, అతి త్వరలోనే భారత్, చైనా దళాలు ఎల్ఎస్‌పీ వద్ద గస్తీ మొదలు పెట్టనున్నాయని తెలిపాయి. డెప్సాంగ్, దెమ్‌చోక్ వద్ద అప్పటి గస్తీ ఏర్పాట్లను పునరుద్ధరిస్తారని భావిస్తున్నామన్నారు. అయితే అందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. ముంబైలో జరిగిన మీడియా సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ, చైనాతో చర్చల్లో పురోగతికి సైన్యం, దౌత్య బందాల కషి కారణమని అన్నారు. ఇటీవల కుదిరిన ఒప్పందంలో భాగంగా దెప్సాంగ్, దమ్‌చోక్‌లో బలగాల ఉపసంహరణ మొదలైందన్నారు. త్వరలోనే ఆ ప్రకియ పూర్తవుతుందని చెప్పారు. ఇది మొదటి అడుగు అని, ఆ తర్వాత 2000 పెట్రోలింగ్ స్టాటస్ యథాపూర్వ పరిస్థితికి రావడం రెండో అడుగు అని అన్నారు. కొత్త ఒప్పందం కొన్ని ప్రాంతాలకే పరిమితమైనదని కూడా ఆయన వివరణ ఇచ్చారు. మిగిలిన చోట్ల పరిస్థితులపై చర్చలు జరుగుతున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులతో జరిగిన మరో కార్యక్రమంలో జైశంకర్ మాట్లాడుతూ, చైనాతో మునుపటి సంబంధాల పునరుద్ధరణ సాధ్యం కావచ్చన్నారు. అయితే దేనికైనా కొంత సమయం పడుతుందని అన్నారు. పరసర్ప విశ్వాసం, కలిసి పనిచేయాలనే ఆసక్తి ఇందుకు దోహదపడతాయని చెప్పారు.

ఉగ్రవాదంపై భారత్ వైఖరి స్పష్టం

ఉగ్రవాదాన్ని భారత్, ప్రపంచ దేశాలు తిప్పికొట్టాల్సిన అవసరాన్ని ముంబై పేలుళ్ల ఘటన చాటిచెప్పిందని జైశంకర్ అన్నారు. యుఎన్ఎస్‌సి సభ్యదేశంగా భారత్ ఉన్నప్పుడు కౌంటర్ టెర్రరిజం కమిటీకి ప్రెసిడెంట్‌గా ఉన్నామని చెప్పారు. ముంబైలో జరిగిన ఘటనలను మళ్లీ పునరావృతం కానీయబోమని జైశంకర్ అన్నారు.

దీపావళికి కొత్త సినిమాల్లేవ్ ...

ఈ ఏడాది దీపావళికి పెద్ద హీరోల సినిమాలు విడుదల కావడం లేదు. కాబట్టి ఈ పండక్కి వెండితెరలు కొత్త కాంతులతో వెలుగొందే అవకాశం లేదు. పెద్ద హీరోల సినిమాలు షూటింగ్‌లు బిజీగా సాగుతున్నాయి. సెప్టెంబర్ 27న విడుదలైన 'దేవర' సినిమా థియేటర్లను కిటకిటలాడించింది. ఇక తరువాత వచ్చే పెద్ద సినిమా హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'పుష్ప 2'నే. అది డిసెంబర్ 5న విడుదల కానుంది. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, హీరోయిన్ శ్రీ వల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై.రవిశంకర్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించారు. ఈ సినిమా తప్ప టాలీవుడ్‌లో పెద్దహీరోల సినిమాలేవీ ఈ ఏడాది విడుదలయ్యే అవకాశాలు లేవు. 'గేమ్ ఛేంజర్', 'హరిహర వీరమల్లు', 'ఉస్తాద్ భగత్‌సింగ్', 'ది మహారాజ సాబ్' వంటి చిత్రాలు షూటింగులో ఉన్నాయి.

'పుష్ప 2'. సినిమా డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్‌లో విడుదల చేయబోతున్నారు. ఇందులో మనదేశంలోని స్క్రీన్స్ 6500. మరిన్ని థియేటర్లు పెరిగే అవకాశం ఉందని మేకర్లు చెబుతున్నారు. మొదటిరోజూ వసూళ్లలో సరికొత్త రికార్డు సృష్టించాలంటే ఎక్కువ స్క్రీన్స్‌లో సినిమాను వేయాలని భావిస్తున్నారు. అదే సమయంలో బెనిఫిట్ షోలు, మిడ్‌నైట్ షోలకు కూడా ప్రభుత్వాల నుంచి అనుమతి కోరుతున్నారు. మొదటి రోజు ఎపి, నైజాంలో అర్ధరాత్రి ఒంటి గంట నుంచే షోలు పడబోతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో రికార్డు బ్రేకింగ్ షోలకు లైన్ క్లియర్ చేస్తున్నట్లుగా మేకర్లు ప్రకటించారు. ఇటీవల హైదరాబాద్‌లో దేశవ్యాప్తంగా పుష్ప-2కు డిస్ట్రిబ్యూషన్ చేస్తున్న వారితో దర్శకులు, నిర్మాతలు సమావేశమయ్యారు. అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'పుష్ప ది రూల్'. దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వచ్చిన 'బాహుబలి 2' చిత్రం తమిళ రికార్డులను అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రం బ్రేక్ చేస్తుందని తమిళ డిస్ట్రిబ్యూటర్ (ఎజిఎస్ బ్యానర్) మాలి నవీన్, మైత్రీ మూవీస్ మేకర్స్ అధినేతల్లో ఒకరైన యలమంచిలి రవిచంద్ర అభిప్రాయపడ్డారు.

పవన్‌కళ్యాణ్ నటిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమా షూటింగు విజయవాడ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతోంది. ఈ సినిమాలో పవన్‌కళ్యాణ్ పాత్ర మినహా మిగతా షూటింగ్ పూర్తయ్యింది. దీనిని అతి త్వరలో పూర్తిచేయటానికి మేకర్లు ప్రయత్నిస్తున్నారు. ఆ తర్వాత 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా కూడా పూర్తిచేయటానికి పవన్‌కళ్యాణ్ కాల్షీట్లు ఇచ్చారని సమాచారం. మొదట్లో ఈ సినిమాకు 'భవదీయుడు భగత్‌సింగ్' అని పేరు పెట్టగా ఆ తర్వాత 'ఉస్తాద్ భగత్‌సింగ్' పేరు మార్చారు.









'దేవర' విజయోత్సాహంతో ఉన్న జూనియర్ ఎన్టీఆర్ తన తదుపరి చిత్రం 'వార్ 2'కు సిద్ధమవుతున్నాడు. ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ కాంబోలో ఈ సినిమా తెరకెక్కనుంది. ఇప్పటికే షూటింగ్ ప్రారంభమైన ఈ సినిమా డిసెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది. 2026 సంక్రాంతికి ఈ సినిమా విడులవుతుంది.

ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి తెరకెక్కించిన చిత్రం 'ది రాజాసాబ్'. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్ హీరోయిన్లుగా నటించారు. హీరో ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సినిమా నుంచి వీడియోతో కూడిన స్పెషల్ మోషన్ పోస్టర్‌ను మేకర్లు విడుదల చేశారు. సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 10న తెలుగుతోపాటు తమిళ, కన్నడ, హిందీలో విడుదల చేయనున్నట్లు మేకర్లు ప్రకటించారు. 'బాహుబలి 3' కూడా ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ప్రభాస్, హను రాఘవపూడి కొత్త సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్‌ను ప్రకటిస్తారని ఊహాగానాలు వచ్చినా ఇంకా జరగలేదు. అలాగే 'సలార్ 2', 'కల్కి 2' సినిమాలు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని అంటున్నారు.

హీరో రామ్‌చరణ్, హీరోయిన్ కియారా అద్వానీ నటించిన 'గేమ్ ఛేంజర్' షూటింగ్ పూర్తయ్యింది. ప్యాచ్ వర్క్ చేస్తున్నామనీ, విడుదల తేదీని కూడా త్వరలోనే



ప్రకటిస్తామంటూ మేకర్లు ప్రకటించారు. తొలుత ఈ సినిమా విడుదల ఆగస్టు 15 అన్నారు. ఇప్పుడు సంక్రాంతికి అంటున్నారు. తన కుమారుడు 'గేమ్ ఛేంజర్' కోసం చిరంజీవి తన సినిమా విడుదల తేదీని మార్చుకోవటానికి అంగీకరించారు. ఈ క్రమంలో రామ్‌చరణ్ మూవీ 'గేమ్ ఛేంజర్' సంక్రాంతి బరిలోకి దిగనుంది.

డబ్ల్యుటిసి ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం

ఐసిసి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్స్ 2021, 2023లలో ఫైనల్స్‌కు చేరుకున్న టీమ్ ఇండియా.. రెండు సార్లూ రన్నరప్‌గానే నిలిచింది. వరుసగా మూడోసారి డబ్ల్యుటిసి ఫైనల్లో పోటీపడేందుకు రంగం సిద్ధం చేసుకున్న రోహిత్ సేనకు న్యూజిలాండ్ గట్టి ఝలక్ ఇచ్చింది. బెంగళూర్, పుణె టెస్టుల్లో పరాజయం చవిచూసిన టీమ్ ఇండియా ఐసిసి డబ్ల్యుటిసి ఫైనల్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది.

- న్యూజిలాండ్ చేతిలో ఓటమితో ఇబ్బందుల్లో భారత్



ముంబయి : ఐసిసి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతూ వచ్చిన టీమ్ ఇండియా.. స్వదేశంలో అనూహ్యంగా వరుసగా రెండు టెస్టు మ్యాచుల్లో పరాజయం పాలైంది. గెలుపు శాతం 70కు పైగా కొనసాగించిన భారత్.. న్యూజిలాండ్ చేతిలో రెండు టెస్టుల్లో ఓటమితో గెలుపు శాతం 60ల్లోకి పడిపోయింది. బెంగళూరు, పుణె టెస్టుల్లో ఓడినా పాయింట్ల పట్టికలో భారత్ ఇప్పటికీ అగ్రస్థానంలోనే కొనసాగుతుంది. కానీ వరుసగా మూడోసారి ఐసిసి డబ్ల్యుటిసి ఫైనల్లో పోటీపడే అవకాశాలు సన్నగిల్లాయి. న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఆరంభానికి ముందు భారత్ సమీకరణం చాలా సులువుగా కనిపించింది. ఎనిమిది టెస్టుల్లో నాలుగింట విజయాలు సాధిస్తే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశం ఉండేది. కానీ రెండు టెస్టుల్లో ఓటమితో సమీకరణం మారిపోయింది. ఆరు టెస్టుల్లో కనీసం నాలుగు మ్యాచుల్లో విజయాలు సాధించాల్సి ఉంది. అందులో ఐదు టెస్టులను బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో తలపడనుంది. మరో టెస్టు మ్యాచ్‌ను స్వదేశంలో నవంబరు ఒకటి నుంచి ముంబయి వేదికగా న్యూజిలాండ్‌తో ఆడనుంది.

కఠిన సవాల్

2023 వన్డే వరల్డ్‌కప్ సహా 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఓటమి ఎదురుకాగా.. 2024 ఐసిసి టి-20 ప్రపంచకప్ విజయంతో భారత క్రికెట్‌లో మళ్లీ వెలుగులు తీసుకొచ్చాడు రోహిత్‌శర్మ. ఐదు రోజుల ఆటలో అందని ద్రాక్షగా మిగిలిన ఐసిసి డబ్ల్యుటిసి టైటిల్‌ను సైతం సొంతం చేసుకుని.. ఐసిసి టైటిల్స్‌లో మిగిలిన ట్రోఫీని సొంతం చేసుకోవాలని రోహిత్‌సేన తపించింది. డబ్ల్యుటిసి పాయింట్ల పట్టికలో భారత్ విజయాల శాతం 62.82గా ఉంది. ఆస్ట్రేలియా 62.50 శాతంతో, శ్రీలంక 55.56 శాతంతో, న్యూజిలాండ్ 50.00 శాతంతో రేసులో ఉన్నాయి. భారత్ ముంబయి టెస్టులో న్యూజిలాండ్‌పై విజయం సాధిస్తే.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ముచ్చటగా మూడోసారి 3-2తో దక్కించుకోవాల్సి ఉంటుంది.

ముంబయి టెస్టులోనూ ఓడితే.. ఇక ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై ఏకంగా 4-1తో ఓడించాల్సి ఉంటుంది. ఇదేమీ అంత సులువు కాదు. ఆ సంగతి భారత జట్టుకు బాగా తెలుసు. న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే.. ఆస్ట్రేలియాలో ఓ విజయం సాధించినా సరిపోతుందనే దీమా రోహిత్‌సేనలో గతంలో కనిపించేంది. కానీ ఇప్పుడు సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓటమి ఆసీస్‌కు బాగా కలిసొచ్చింది. ఇప్పుడు ఆ జట్టు భారత్‌తో సిరీస్‌ను 3-2తో నెగ్గితే సరిపోతుంది. కానీ అంతకుముందు శ్రీలంకతో టెస్టు సిరీస్‌ను సైతం కనీసం 1-0తో నెగ్గినా సరిపోతుంది. శ్రీలంకలో ఆసీస్ సిరీస్ ఓడినా.. భారత్‌ను స్వదేశంలో 4-1తో ఓడిస్తే సరిపోతుంది.

హైదరాబాద్ భారీ స్కోరు

- మెరిసిన తన్మయ్, రోహిత్, హిమతేజ



హైదరాబాద్ : పుదుచ్చేరితో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ స్కోరు నమోదు చేసింది. ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (173, 328 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సులు) సెంచరీతో కదం తొక్కగా.. అభిరాత్ రెడ్డి (68), రోహిత్ రాయుడు (84), హిమతేజ (60), తనయ్ త్యాగరాజన్ (53) అర్ధ సెంచరీలతో మెరిశారు. 163 ఓవర్లలో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 536/8 వికెట్లకు డిక్లరేషన్ ప్రకటించింది. 3.29 రన్‌రేట్‌తో పరుగులు సాధించిన హైదరాబాద్ మరోసారి బ్యాట్ పట్టాల్సిన అవసరం లేకుండా భారీ స్కోరు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ఇచ్చింది. రెండోరోజు ఆఖర్లో 12 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి 24/2తో ఎదురీదుతోంది. ప్రస్తుతం పుదుచ్చేరి 512 పరుగుల వెనుకంజలో నిలిచింది. పుదుచ్చేరి బ్యాటర్లు గౌరవ్ యాదవ్ (0), ఆకాశ్ (1) అజేయంగా ఆడుతున్నారు.



మనిక పరాజయం

న్యూఢిల్లీ : ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్స్ టోర్నీలో భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనిక బత్ర పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. వరల్డ్ నెం.30 ప్యాడ్లర్ మనిక బత్ర 25 నిమిషాల్లోనే సెమీఫైనల్ బెర్త్ చేజార్చుకుంది. చైనా అమ్మాయి టినాయి 11-8, 11-8, 12-10తో మనికపై పైచేయి సాధించింది. మనిక బత్ర మూడు గేముల్లోనూ గట్టిగా పోరాడినా.. చైనా అమ్మాయిదే పైచేయిగా నిలిచింది. తెలుగమ్మాయి ఆకుల శ్రీజ పోరాటం తొలి రౌండ్లోనే ముగిసిన సంగతి తెలిసిందే.



దేశంలో అత్యుత్తమ బ్యాంక్‌గా ఎస్‌బిఐ

- గ్లోబల్ ఫైనాన్స్ మేగజైన్ ఎంపిక

న్యూఢిల్లీ : భారతదేశంలో అత్యుత్తమ బ్యాంకుగా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నిలిచింది. 2024 సంవత్సరానికి గాను ఎస్‌బిఐని బెస్ట్‌బ్యాంక్‌గా అమెరికాలోని గ్లోబల్ ఫైనాన్స్ మేగజైన్ ఎంపిక చేసింది. వినియోగదారులకు అసాధారణ సేవలను అందించడం, వారి నమ్మకాన్ని సాధించడం, ఆర్థిక సేవల్లో నిబద్ధత తదితర అంశాల ఆధారంగా ఈ గుర్తింపు లభించినట్లు ఎస్‌బిఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు వార్షిక సమావేశాల సందర్భంగా వాషింగ్టన్‌లో నిర్వహించిన 31వ వార్షిక బెస్ట్ బ్యాంక్ అవార్డుల కార్యక్రమంలో ఈ అవార్డును సంస్థ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అందుకున్నారని పేర్కొంది. ప్రపంచంలోని ఆర్థిక సంస్థల సేవల ఆధారంగా గ్లోబల్ ఫైనాన్స్ మేగజైన్ బెస్ట్ బ్యాంక్ అవార్డును దశాబ్దాలుగా ప్రదానం చేస్తోంది.

26న పార్లమెంటు ప్రత్యేక భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగానికి ఆమోదం లభించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నవంబరు 26న పార్లమెంటు ఉభయ సభలు ప్రత్యేకంగా సమావేశం కానున్నాయి. 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించిన పార్లమెంటు సెంట్రల్ హాల్లోనే ఉభయ సభల సభ్యులు సమావేశమవుతారు. రాజ్యాంగానికి ఆమోదం లభించినప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ ఆర్టికల్స్, చట్టాల్లో జరిగిన మార్పులు, చేర్పుల గురించిన విషయాలు ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. కాగా, గతంలో నవంబరు 26న జాతీయ న్యాయ దినోత్సవంగా నిర్వహించేవారు. అయితే 2015లో అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకుని ఆ రోజును రాజ్యాంగ దినోత్సవంగా మార్చారు. వచ్చే నవంబరు 26 నాటికి మన రాజ్యాంగం ఆమోదం పొంది సరిగ్గా 75 ఏళ్లు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ఆ రోజున పార్లమెంటు ఉభయసభలను ప్రత్యేకంగా సమావేశపర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా అనంత్‌నాథ్



న్యూఢిల్లీ : ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా కారవాన్ మ్యాగజైన్ ఎడిటర్ అనంత్‌నాథ్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మాజీ ఔట్‌లుక్ ఎడిటర్ రూబెన్ బెనర్జీ, కోశాధికారిగా ది ట్రిబ్యూన్ మాజీ సీనియర్ అసోసియేట్ ఎడిటర్ కెవి ప్రసాద్ ఎన్నికైనట్లు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది.

హారిస్ ఎన్నికైతే మూడో ప్రపంచ యుద్ధమే

- డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవికి కమలా హారిస్ గనుక ఎన్నికైతే అమెరికాను మూడో ప్రపంచ యుద్ధం వైపు నెడతారని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అధ్యక్ష ఎన్నికలు నవంబరు 5 తేదీ దగ్గర పడుతుండడంతో ట్రంప్, హారిస్ మధ్య మాటల యుద్ధం తీవ్రరూపం దాల్చింది. శనివారం సాయంత్రం పెన్సిల్వేనియాలో ఓ ఎన్నికల ప్రచారసభలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. హారిస్‌ను అధ్యక్షురాలిని చేస్తే లక్షలాది జీవితాలతో జూదం ఆడినట్టే అవుతుందని, అమెరికా పిల్లలను యుద్ధానికి సిద్ధం చేసినట్టే అవుతుందని, ఆమె అసమర్థురాలని ట్రంప్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎప్పటి మాదిరిగానే ఆయన అమెరికన్ జాతీయ వాదాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు కూడా చేశారు. అమెరికాపై దాడి జరిగితే అమెరికాలోని విదేశీ పౌరుల లక్ష్యంగా మిలిటరీ దాడులకు తాను ఆదేశిస్తానని అన్నారు. ఇదిలా వుండగా కమలా హారిస్‌కు హాలీవుడ్ నటుడు ఆస్కార్ విజేత లియోనార్డో డికాప్రియా మద్దతు తెలిపారు.

29 మంది సంయుక్త కార్యదర్శుల నియామకం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం అధికార యంత్రాంగంలో భారీగా మార్పులు చేసింది. వివిధ శాఖల్లో 29 మంది సంయుక్త కార్యదర్శులను నియమించింది. ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ (ఐడీఏఎస్), ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ (ఐఆర్ఎస్ఇఇ), ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీస్ (ఐఎ అండ్ ఎఎస్), ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) సహా పలు కేంద్ర సర్వీసుల్లో పనిచేస్తున్న అధికారులను కీలకమైన సంయుక్త కార్యదర్శి స్థాయి పోస్టుల్లో నియమించింది. ఈ మేరకు సిబ్బంది మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఐడిఎఎస్ అధికారులు ప్రవీణ్ కుమార్ రాయ్, రాకేష్ కుమార్ పాండే, ఐఆర్ఎస్ఇఇ అధికారి రాజేష్ గుప్తాలను హోం శాఖలో సంయుక్త కార్యదర్శులుగా నియమించారు. 1999 బ్యాచ్ ఐఎ అండ్ ఎఎస్ అధికారి రాజ్‌కుమార్ సిఆర్‌పిఎఫ్‌లో డైరెక్టర్ (ఫైనాన్స్) అయ్యారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి భావనా సక్సేనాను సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ సీఈఓగా నియమించారు.

లౌకికవాదం, సామాజిక న్యాయమే మా సిద్ధాంతం

- తొలి సభలో సినీ హీరో విజయ్



చెన్నై : విభజన రాజకీయాలకు, అవినీతి శక్తులకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రముఖ తమిళ సినీ హీరో, టివికె పార్టీ అధ్యక్షుడు జోసఫ్ విజయ్ చంద్రశేఖర్ ప్రకటించారు. బిజెపి నిరంకుశత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. తమ ప్రధాన సైద్ధాంతిక ప్రత్యర్థి బిజెపి అని, దాని తర్వాత రాష్ట్రంలో డిఎంకె అని స్పష్టం చేశారు. 'మేము సమానంగా పుట్టామని మా ప్రాథమిక నమ్మకం. అది ఎవరికి వ్యతిరేకంగా ఉంటుందో నేను చెప్పాల్సిన అవసరం ఉందా? విభజన వాక్చాతుర్యంతో (బిజెపి) ఈ దేశాన్ని నాశనం చేస్తున్న వారు మనకు సైద్ధాంతిక శత్రువులు, తన స్వప్రయోజనాల కోసం మాత్రమే శ్రద్ధ వహించే కుటుంబం 'ద్రావిడ మోడల్' అంటూ ప్రచారం చేస్తూ పెరియార్, అన్నాదురై పేర్లను దుర్వినియోగం చేస్తూ ప్రజలను దోపిడీ చేస్తున్న వారు మనకు రాజకీయ శత్రువులు' అని అన్నారు. విల్లుపురం సమీపంలో నిర్వహించిన తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ మొదటి మహానాడులో విజయ్ సుదీర్ఘ ప్రసంగం చేశారు. "నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు. కానీ, నేను పాలిటిక్స్ విషయంలో భయపడడం లేదు" అని అన్నారు. సినీ రంగంతో పోలిస్తే రాజకీయ రంగం చాలా సీరియస్ అని పేర్కొన్నారు. "ద్రవిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలను అనుసరిస్తాం. తమిళనాడు గడ్డకు ఇవి రెండు కళ్లలాంటివి. లౌకికవాదం, సామాజిక న్యాయమే మా భావజాలం. వాటి ఆధారంగానే పని చేస్తాం. పెరియార్ ఇవి రామస్వామి, కె.కామరాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్, వేలు నాచియార్, అంజలి అమ్మాళ్ ఆశయాలతో పార్టీని ముందుకు తీసుకెళ్తాం. రాజకీయాల్లో ఫెయిల్యూర్స్, సక్సెస్ స్టోరీలు చదివాక.. నేను నా కెరీర్‌ని పీక్‌లో వదిలేసి మీ అందరిపై అచంచలమైన విశ్వాసాన్ని ఉంచి మీ విజయ్‌గా ఇక్కడ నిలబడ్డా. రాజకీయ అనుభవం లేదంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ అమితమైన ఆత్మవిశ్వాసంతో మనం సర్పం (రాజకీయం)తో ఆడుకునే పిల్లల్లాంటివాళ్లం" అని అన్నారు. తన రాజకీయ ప్రయాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. అరియలూరులో నీట్ విద్యార్థిని అనిత ఆత్మహత్య ఉదంతాన్ని గుర్తు చేస్తూ నీట్‌పై తమ పార్టీ వ్యతిరేక వైఖరిని ఈ సందర్భంగా ప్రకటించారు. సినిమా కెరీర్‌లో అత్యున్నత స్థాయిని వదిలేసి ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చా. నేను సినిమాల్లోకి వచ్చినప్పుడు కూడా నన్ను అవమానించారు. అయినా, కఠోర శ్రమ, ధైర్యంతో ఈ స్థాయికి చేరుకున్నా. ఎంజిఆర్, ఎన్‌టిఆర్ సైతం ఇదే విధమైన విమర్శలను ఎదుర్కొన్నారు. కానీ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వారు ప్రభంజనం సృష్టించారు. ప్రతి ఓటు ఎంతో శక్తిమంతమైనది.. మా పార్టీ తమిళనాడు రాజకీయాలపై బలమైన ప్రభావం చూపుతుంది" అని అన్నారు. "రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మమ్మల్ని పూర్తిస్థాయి మెజార్టీతో గెలిపిస్తారని పూర్తిగా విశ్వసిస్తున్నాం. ఒకవేళ ఏవైనా పార్టీలు పొత్తు పెట్టుకోవాలనుకుంటే.. వారికి అధికారంలో భాగస్వాముల్ని చేస్తాం" అన్నారు.

సభా వేదికపై ఆ పార్టీ నేత ప్రొఫెసర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. తమిళగ వెట్రి కళగం పార్టీ సిద్ధాంతాలు, విధానాలను వివరించారు.. "పుట్టుకతోనే మనుషులంతా సమానం. సమ సమాజాన్ని సష్టించడమే పార్టీ లక్ష్యం. దీంతో పాటు సెక్యులరిజం, రాష్ట్ర స్వయంప్రతిపత్తి, సమ్మిళిత అభివృద్ధి, ద్విభాషా విధానం, అవినీతిపై పోరాటం, తిరోగమన ఆలోచనల తిరస్కరణ, డ్రగ్స్ రహిత తమిళనాడు వంటివి ప్రధాన అంశాలు"గా పేర్కొన్నారు. అనంతరం మరో నేత కేథరిన్ మాట్లాడారు.

మరో 50 విమానాలకు బెదిరింపులు

- 14 రోజుల్లో 350 ఘటనలు

న్యూఢిల్లీ : విమాన బెదిరింపులను కేంద్రప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నప్పటికీ... అవి కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం మరో 50 విమానాలకు బెదిరింపులు వచ్చాయి. గత 14 రోజుల్లో మొత్తంగా 350కిపైగా విమానాలు ఈ తరహా బెదిరింపులు ఎదుర్కొన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తమ సంస్థకు చెందిన 15 విమానాలకు ఆదివారం బెదిరింపులు వచ్చాయని, పూర్తిస్థాయి తనిఖీల అనంతరం సర్వీసులు కొనసాగాయని ఆకాశ ఎయిర్‌లైన్స్ తెలిపింది. ఇండిగోకు చెందిన 18 విమానాలకు, 17 విస్తారా విమానాలకు ఇటువంటి మెసేజ్‌లు వచ్చాయి. కొన్నిరోజులుగా భారత్‌కు చెందిన విమానాలకు బూటకపు బాంబు బెదిరింపులు పెరగడంతో సామాజిక మాధ్యమ వేదికలకు కేంద్ర ఐటి మంత్రిత్వశాఖ ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసింది.

వీటి వెనుక ఉన్న వ్యక్తులపై కఠినచర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మరోసారి స్పష్టం చేశారు. బాంబు బెదిరింపు హెచ్చరికలు చేస్తున్న వ్యక్తులు విమానాల్లో ప్రయాణించకుండా చేసేందుకు నో ఫ్లయిర్ జాబితాలో చేర్చేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ చట్టంలో మార్పులు చేయబోతున్నట్టు సమాచారం.

అందరికీ ఆరోగ్యంలో కేరళకు తొలిస్థానం

ప్రజారోగ్యం రూపురేఖలు మార్చుచేశాం : సిఎం విజయన్



సభలో మాట్లాడుతున్న విజయన్

అలప్పుజ : ఆధునిక చికిత్సా విధానాలు, పరికరాలను గుణాత్మకంగా మార్చడం ద్వారా అందరికీ ఆరోగ్యాన్ని అందించడంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. కేరళలో ప్రజారోగ్య రంగం రూపురేఖలు మారిపోయాయని అన్నారు. అలప్పుజ జనరల్ హాస్పిటల్‌లో రూ.117 కోట్లతో నిర్మించిన బహుళ అంతస్థుల ఓపీ భవనం, పరికరాల వ్యవస్థలను ప్రారంభించిన సందర్భంగా సిఎం మాట్లాడారు. కోవిడ్ - 19 సమయంలో రాష్ట్రంలో అందించిన సేవలు, తమ ప్రభుత్వం గతంలోనూ, ఇప్పుడు కల్పించిన మౌలిక సదుపాయాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేన్సర్ చికిత్స సౌకర్యాలు కల్పించడం ద్వారా సామాన్యులకు చికిత్స ఖర్చు తగ్గించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ వైరాలజీలో ఇప్పటికే లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు భవనాలు, 14 అత్యాధునిక ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. భవన నిర్మాణం, వైద్య పరికరాలు, ఫర్నీచర్ కోసం ప్రభుత్వం కెఐఎఫ్‌బి నుంచి రూ.117 కోట్లు కేటాయించిందన్నారు. ఎంఆర్ఐ స్కాన్, సీటీ స్కాన్, మామోగ్రామ్, ఆధునిక పరికరాలతో కూడిన మెడికల్ ల్యాబ్ తదితరాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అధ్యక్షత వహించి ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ఎంఆర్ఐ స్కానింగ్ కేంద్రాన్ని మత్స్యశాఖ మంత్రి సాజి చెరియన్ ప్రారంభించారు. వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్ సిటి స్కానింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు.

ఇరాన్‌పై దాడికి పలు దేశాల ఖండన

- పశ్చిమ దేశాలు మౌనం

టెహ్రాన్: ఇరాన్‌పై ఇజ్రాయిల్ దురాక్రమణపూరిత దాడిని పలు దేశాలు ఖండించాయి.పశ్చిమ దేశాలు మాత్రం మౌనం వహించాయి. ఫ్రాన్స్ వంటి దేశం స్పందించినా ఇజ్రాయిల్ దాడిని నేరుగా ఖండించలేదు.శనివారం వేకువ జామున ఇరాన్ రాజధాని టెహ్రాన్ నైరుతి ప్రాంతంపై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిని సౌదీ అరేబియా, యుఎఇ, కువైట్, ఖతార్, ఈజిప్టు, యెమెన్,మలేసియా, సిరియా, జోర్డాన్, లెబనాన్ తదితర దేశాలు తీవ్రంగా ఖండించాయి. సౌదీ అరేబియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన చేస్తూ, ఇజ్రాయిల్ దాడి ఇరాన్ సార్వభౌమత్వాన్ని,అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది. ఇజ్రాయిల్ చర్యను ఇరాన్ సార్వభౌమత్వంపై దాడిగానే పరిగణించాలని ఖతార్ వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని ఖతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ప్రాంత భద్రత, సుస్థిరతను సవాల్ చేసే ఏ చర్యను అంగీకరించబోమని ఈజిప్టు స్పష్టం చేసింది. ఇరాన్‌పై దాడి చేయడం ద్వారా ఇజ్రాయిల్ ఈ ప్రాంతాన్ని పూర్తి స్థాయి యుద్ధంలోకి లాగుతున్నదని టర్కీ పేర్కొంది. ఇరు పక్షాలు సంయమనం పాటించాలని రష్యా కోరింది.

ర్మనీ చాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేయకుండా చూడాలని ఇరాన్‌ను కోరారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా ఇదే విధంగా స్పందించారు. వివాదాన్ని నివారించడానికి ఇరు పక్షాలు ప్రయత్నించాలని ఫ్రాన్స్ హితవు పలికింది.


యుద్ధ విస్తరణను నిలిపివేయాలి: ఐరాస

పశ్చిమ దేశాలలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధ విస్తరణ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని ఆయన కోరారు. పశ్చిమాసియా అంతటికీ యుద్ధం విస్తరించకుండా నిరోధించాలని ఆయన అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు.

ఇజ్రాయిల్‌కు బుద్ధి చెబుతాం: ఇరాన్

ప్రతీకార దాడి చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇజ్రాయిల్‌ను ఇదివరకే హెచ్చరించిన ఇరాన్ శనివారం నాటి దాడికి తగు రీతిలో సమాధానమిచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని పేర్కొంది.

టెహ్రాన్ నైరుతి, పశ్చిమ ప్రాంతాల్లోని వైమానిక, సైనిక స్థావరాలపై ఇజ్రాయిల్ చేసిన దురాక్రమణ పూరిత దాడిని తమ దళాలు చాలా వరకు నిర్వీర్యం చేశాయని, దాడి ప్రభావం చాలా పరిమితమని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చి తెలిపారు. తమ ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునేందుకు ఇరాన్ తీసుకునే చర్యలకు హద్దంటూ ఏమీ ఉండదని ఆయన అన్నారు. ఈ దాడి తరువాత కూడా తమ చమురు, విద్యుత్ గ్రిడ్‌లు మామూలుగానే పనిచేసు కుంటున్నాయని ఆయన తెలిపారు. పశ్చిమ దేశాలు, వాటి ఆధ్వర్యంలోని మీడియా ఇరాన్ కోలుకోలేని విధంగా దెబ్బ తినిపోయిదని అసత్య ప్రచారం చేస్తున్నాయని విమర్శిం చారు. ఇజ్రాయిల్‌లో నెతన్యాహు ప్రభుత్వం అంతర్గతం, బాహ్యంగా ఎదుర్కొంటున్న సమస్యల నుంచి దృష్టి మళ్లిం చేందును నిర్వహించిన పబ్లిక్ స్టంట్‌గా ఆయన పేర్కొన్నారు.



బందీలను విడిపించాలని, యుద్ధాన్ని విరమించాలని టెల్ అవీవ్‌లో ఆందోళన చేస్తున్న ఇజ్రాయిలీలు

గాజాపై ఇజ్రాయిల్ భయానక దాడులు

22 మంది మృతి-లెబనాన్ సరిహద్దుల్లో ఇళ్లు పేల్చివేత

గాజాపై ఇజ్రాయిల్ భయానక దాడులకు పాల్పడింది. ఉత్తర, దక్షిణ గాజాపై శనివారం రాత్రి నుంచి ఉధృతంగా జరుపుతున్న ఈ దాడుల్లో పెద్దయెత్తున ప్రాణ నష్టం ఉంటుందని భావిస్తున్నారు. ఒక్క ఉత్తర గాజాలోనే 22 మంది చనిపోయారు. దక్షిణ గాజాలోను, గాజా సరిహద్దు గ్రామాలపైన యథేచ్ఛగా సాగిస్తున్న దాడుల్లో ఎంత మంది చనిపోయారన్నది ఇంకా తెలియరాలేదు. లెబనాన్ సరిహద్దు గ్రామాల్లోని ఇళ్లను డైనమైట్‌లతో ఇజ్రాయిల పేల్చివేసినట్లు లెబనీస్ మీడియా తెలిపింది. సరిహద్దు గ్రామమైన అడైసేలో ఇజ్రాయిల్ సైన్యం తెల్లవారుజామున దాడి చేసి పౌర ఆవాసాలను పేల్చివేసిందని లెబనీస్ నేషనల్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. మరో సరిహద్దు గ్రామమైన పార్ కిలాలో కూడా పెద్దయెత్తున పేలుళ్ల శబ్దాలు వినిపించాయని, దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకుందని ఎన్ఎఎన్ తెలిపింది. అంతకుముందు దక్షిణ లెబనాన్‌లోని వ్యూహాత్మక భూగర్భ సదుపాయాన్ని 400 టన్నుల పేలుడు పదార్థాలను ఉపయోగించి పేల్చివేసినట్లు ఇజ్రాయిల్ మిలిటరీ ప్రతినిధి అవిచాయ్ ఆడ్రే చెప్పారు. ఇదిలా వుండగా టెల్ అవీవ్ సమీపంలోని బస్‌స్టాప్ పైకి ట్రక్కు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరు చనిపోగా, మరో 30 మంది గాయపడ్డారు. దాడి చేసిన వ్యక్తి ఇజ్రాయిల్‌లోని అరబ్ పౌరుడని ఇజ్రాయిల్ పోలీసులు తెలిపారు. ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఈ దాడి చోటుచేసుకుంది. ఉత్తర గాజాలో మారణ కాండ పట్ల ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు.

సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో ఎర్ర జెండాలు పాతిన కార్మికులు

(మొదటిపేజీ తరువాయి)

సహా నష్టపరిహారం చెల్లించాలంటూ 2015లో సెంట్రల్ లేబర్ కోర్టు, హైకోర్టు ఆదేశాలు ఇచ్చాయని తెలిపారు. కార్మికులకు రూ.43 కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని కోర్టులు తీర్పు ఇచ్చినా యాజమాన్యం అమలు జరపడం లేదన్నారు. దశాబ్దాలు గడిచినా కార్మికులకు ప్రభుత్వాలు న్యాయం చేయలేదని తెలిపారు. ఫ్యాక్టరీ ఈ భూములను అప్పట్లో రూ.10 కోట్లకు కొనుగోలు చేసిందని, నేడు వాటి ధర రూ.2 వేల కోట్లకుపైగా ఉందని వివరించారు. కోల్‌కత్తా కోర్టు ద్వారా 2003లో బాలభాను ఎంటర్‌ప్రైజెస్, ఎన్ఐఆర్ నామినల్ ధరకు వేలంలో ఈ భూములను దక్కించుకున్నారు. కార్మికులకు నష్టపరిహారం ఇవ్వలేదు. నిబంధనలు అమలు చేయలేదు. న్యాయంగా కార్మికులకు రావాల్సిన వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఫ్యాక్టరీ లాకౌట్ అయిన నాటికి 333 మంది కార్మికులు పని చేసేవారని తెలిపారు. న్యాయం చేయకపోవడంతో వారిలో 160 మంది అర్ధాకలితో చనిపోయారని, దీనికి ప్రభుత్వాలు, ఫ్యాక్టరీ యాజమాన్యం బాధ్యత వహించాలని అన్నారు. యాజమాన్యం, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్లే కార్మికులు ప్రత్యక్ష కార్యాచరణకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ కార్మికులు ఫ్యాక్టరీ భూముల్లోనే ఇల్లు కట్టుకొని ఉండాలని పిలుపునిచ్చారు. సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన పోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతిస్తుందని తెలిపారు. సిపిఐ ఎంఎల్ నాయకులు స్వామి మాట్లాడుతూ పాలక పార్టీలు యజమానుల పక్షమా? కార్మికుల పక్షామో అనేది తేలే సమయం ఆసన్నమైందన్నారు. కార్మికుల పోరాటంలో సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, నాయకులు డి.వెంకటరెడ్డి, డి శ్రీనివాసకుమారి, ఐఎఫ్‌టియు నాయకులు చెన్నయ్య తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఫ్యాక్టరీ భూముల్లోకి కార్మికులు రాకముందు ఎపిఎస్‌పి పోలీసులు... ఫ్యాక్టరీ భూములున్న బ్రహ్మానందపురంలో కవాతు నిర్వహించారు. అయినా, కార్మికులు భయపడకుండా ఈ భూముల్లోకి వెళ్లారు.

నాయకులు, కార్మికులపై అక్రమ కేసు నమోదు

ఎన్ఆర్ఐ ప్రతినిధుల తప్పుడు ఫిర్యాదు మేరకు అఖిలపక్ష నాయకులపైనా, కార్మికులపైనా తాడేపల్లి పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారు. కర్రలతో తమను కొట్టబోయారని, అడ్డొస్తే చంపేస్తామని, బెదిరించారని ఎన్ఆర్ఐ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, నాయకులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బూరగం వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, సిఐటియు నాయకులు వై.నేతాజీ, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, సిపిఐ నాయకులు చిన్ని పిచ్చయ్య, కంచర్ల కాశయ్య, టి.వెంకటయ్య, సిపిఐ ఎంఎల్ నాయకులు స్వామి, కోటేశ్వరరావు, ఆదినారాయణ, సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు సహా మొత్తం 20 మందిపై 329 (3), 324 (4), 351 (2), రెడ్ విత్ బి ఎన్ ఎస్ 3 (5) బిఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తాడేపల్లి సిఐ కల్యాణ్ రాజు తెలిపారు.



బాంద్రా రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట, క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ముంబై బాద్రా రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట

- 10 మందికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం

ముంబై : దీపావళి సందర్భంగా ఏర్పడిన రద్దీ తొక్కిసలాటకు దారితీసింది. ముంబై బాంద్రా రైల్వే స్టేషన్‌లో గోరఖ్‌పూర్ వెళ్లే రైలు ఎక్కే సమయంలో జరిగిన తొక్కిసలాటలో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రైల్వే పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం 22921 బాంద్రా టెర్మినస్-గోరఖ్‌పూర్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లో ఆగడానికి ముందే కాలు మోపేందుకు కూడా చోటు లేదు. రైలు రావడంతో ప్రయాణికులు ఎక్కేందుకు ప్రయత్నించినప్పుడు ఈ ఘటన జరిగింది. గాయపడిన వారిని బాంద్రా భాబా ఆసుపత్రికి తరలించినట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు ప్రయాణికులను ఇంద్రజిత్ సహని (19), నూర్ మహ్మద్ షేక్ (18)గా గుర్తించి చికిత్స నిమిత్తం కెఇఎం ఆసుపత్రికి తరలించామన్నారు. నూర్‌కు బాగా దెబ్బలు తగిలాయని, వైద్యులు ఆక్సిజన్ సదుపాయం కల్పించారని చెప్పారు. ప్లాట్ ఫామ్ జనంతో కిటకిటలాడిందని, నిలబడేందుకు కూడా చోటు లేదని, రైలు ఎక్కేందుకు ఒకరిని ఒకరు తోసుకోవడంతో తన సోదరుడు తీవ్రంగా గాయపడ్డాడని వికాస్ గుప్తా చెప్పాడు. తాము గోరఖ్‌పూర్ నుంచి వలస వచ్చామని, ముంబైలో టైలర్ దుకాణంలో అసిస్టెంట్లుగా పనిచేస్తున్నామని తెలిపారు.

తీవ్ర ఆందోళనకరం : రాహుల్‌గాంధీ

ఈ ఘటన తీవ్ర ఆందోళనకరమని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు, "ఈ తొక్కిసలాట భారతదేశంలో నాసిరకం మౌలిక సదుపాయాలకు తాజా ఉదాహరణ. గత ఏడాది జూన్‌లో జరిగిన బాలాసోర్ రైలు ప్రమాదంలో 300 మంది ప్రాణాలు కోల్పోయారు, బాధితులకు నష్టపరిహారం ఇవ్వడానికి బదులుగా, బిజెపి ప్రభుత్వం సుదీర్ఘ న్యాయ పోరాటం చేస్తోంది. ప్రారంభోత్సవాలు, ప్రచారంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు సేవ చేయడానికి ఉంటే మంచిది. నిర్వహణ లేకపోవడం, ప్రభుత్వ ఆస్తులను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణనష్టం జరగడం తీవ్రమైన ఆందోళన కలిగిస్తుంది' అని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో 25కి పైగా పెద్ద రైల్వే ప్రమాదాలు సంభవించాయని, వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ విమర్శించారు. బుల్లెట్ రైళ్లు, మెట్రో, హైస్పీడ్ రైళ్ల గురించి మాట్లాడటం ఏంటి అని ఆయన ప్రశ్నించారు.

క్రోనిజానికి ఉదాహరణ

- మాధవి బచ్ స్కాంపై రాహుల్

న్యూఢిల్లీ : సెబీ చైర్‌పర్సన్ మాధబి బుచ్ స్కాం క్రోనిజానికి ఉదాహరణ అని కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ విమర్శించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఒక వీడియోలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. సంస్థలు నిర్వీర్యమై, క్రోనిజం చేతుల్లోకి వెళ్లినపుడు ఏం జరుగుతుందో తెలియజెప్పే ఒక ఉదాహరణ మాధబి బుచ్ కుంభకోణం అని రాహుల్ చెప్పారు. తాను హాజరుకాలేనని మాధబి చెప్పటం, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) తన సమావేశాన్ని వాయిదా వేసిన కొన్ని రోజుల తర్వాత రాహుల్ నుంచి ఈ వ్యాఖ్యలు రావటం గమనార్హం. సామాన్య భారతీయులను, వారి పెట్టుబడులను రక్షించే బాధ్యతను కలిగి ఉన్నవారు.. వారి బాధ్యతలను రద్దు చేసుకున్నారు. విస్తృతమైన అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ సమస్యలను కాంగ్రెస్ లేవనెత్తుతున్నది. అనేక స్కామ్‌లను పరిశోధించి, వాస్తవాన్ని బయట పెడుతున్నది. సంస్థాగత పతనం ఆశ్రితవాదాన్ని ప్రోత్సహించింది" అని రాహుల్ తెలిపారు. ఈ కుంభకోణంలో ఇప్పటి వరకు వచ్చిన సమాచారం కొంత మాత్రమేననీ, అవినీతిపరులను రక్షించే ఆటలో పెద్ద సిండికేట్ ఉన్నదని ఆయన పేర్కొన్నారు. మాధబి, ఆమె భర్త ధావల్ బచ్‌లు అదానీ సైఫనింగ్ కుంభకోణంలో డొల్ల సంస్థలలో వాటా కలిగి ఉన్నారని హిండెన్ బర్గ్ ఆరోపించిన సంగతి తెలిసిందే

హెచ్‌సియు విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి విజయకేతనం



ఆనందోత్సాహాల్లో విద్యార్థులు




ఉమేష్ (ప్రెసిడెంట్)



ఆకాష్ (వైస్ ప్రెసిడెంట్)



సులేమాన్ (ప్రధాన కార్యదర్శి)



భవిత



త్రివేణి (జాయింట్ సెక్రటరీ)



కెవి.కృష్ణమూర్తి (కల్చరల్ సెక్రటరీ)



రెహ్మాన్ (స్పోర్ట్స్ సెక్రటరీ)



శృతికీర్తి

ప్రజలకు మరింత చేరువగా విమాన సేవలు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నామని తెలిపారు భోగాపురం విమానాశ్రయం బ్రైట్ స్పాట్‌గా మారుతుందని పేర్కొన్నారు. వారణాసి, అయోధ్యలకు విమాన సర్వీసులు నడపాలనే ప్రతిపాదన ఉందన్నారు. విశాఖ నుంచి వీలైనన్ని కొత్త సర్వీసులు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. విజయవాడ-విశాఖ మధ్య రెండు నూతన సర్వీసులు అందుబాటులోకి రావడంతో టికెట్ ధరలు తగ్గుతాయన్నారు. ఎంపి శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి, రాష్ట్ర ఆర్థిక రాజధాని వైజాగ్ మధ్య అనుసంధానం మరింత పెరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది ప్రజా రవాణా, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, విశాఖ ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

నూతన సర్వీసుల వేళలు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.35 గంటలకు విశాఖలో బయలుదేరి 10.35 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రాత్రి 7.55 గంటలకు బయలుదేరి తొమ్మిది గంటలకు విశాఖ చేరుతుంది. ఇండిగో సర్వీసు రోజూ రాత్రి 7.15 గంటలకు విజయవాడలో బయలుదేరి 8.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 8.45 గంటలకు విశాఖలో బయలుదేరి, 9.50 గంటలకు విజయవాడ చేరుకుంటుంది.

కడప-హైదరాబాద్ విమాన సర్వీసు ప్రారంభం

వైఎస్ఆర్ జిల్లాలోని కడప ఎయిర్ పోర్టులో కడప-హైదరాబాద్ ఇండిగో కనెక్టింగ్ విమాన సర్వీసును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీకి కూడా విమాన సర్వీసులు నడిపేందుకు కేంద్ర మంత్రులతో మాట్లాడతానన్నారు.



మీకోసం

పగిలిన గుడ్డును కొద్దిగా వెనిగర్ కలిపిన నీటితో ఉడికిస్తే లోపలి ద్రవం బయటికి రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఉన్నతంగా ఆలోచించడం అలవాటు చేసుకున్నప్పుడు మనకు మనమే మార్గదర్శకులుగా మారుతాం.

మునగ చెట్టు ఎక్కించొద్దు



పచ్చని ప్రకృతి నడుమ గోస్తనీ నదీ తీరాన చామలాపల్లి అనే పల్లెటూరు ఉంది. అదే గ్రామానికి చెందిన శ్రావణి, స్వాతి, సంధ్య ముగ్గురూ స్నేహితులు. ఉన్నత చదువుల కోసం వాళ్లు రోజూ ధర్మవరం వెళ్తారు. సైకిల్ తొక్కుకుంటూ, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్లడం వాళ్లకు భలే సరదా. ఆ ముగ్గురిలో స్వాతి తెలివైనది, చురుకైనది. ప్రతి పరీక్షలో పాఠశాల ప్రథమురాలిగా నిలిచేది.

ఒకరోజు పాఠశాలనుంచి తిరిగి వస్తూ 'శ్రావణీ నువ్వు పెద్దయ్యాక ఏమౌతావే? 'డాక్టరు అవ్వాలనుకుంటున్నవా? లేక టీచర్ అవ్వలనుకుంటున్నావా?' అని అడిగింది సంధ్య. 'నేను వెనుక బెంచీ స్టూడెంట్‌ని, నన్నెందుకు అడుగుతావు. నీ పక్కనే ఉన్న స్వాతిని అడుగు' అంది శ్రావణి.

సంధ్య, స్వాతి వైపు చూసి 'ఇది బాగా చదువుతుంది. డాక్టర్ అయినా అవుతుంది. కలెక్టర్ అయినా అవుతుంది' అంది. ఆ మాటలకు వంత పాడింది శ్రావణి. ఇలా సంధ్య, శ్రావణి స్వాతిని పొగుడుతూ ఉంటే, 'ఆపండర్రా మీ గోల! మునగచెట్టు ఎక్కించింది చాలు' అంది స్వాతి.


'మునగ చెట్టు ఎక్కించడమంటే?' అని ముక్తకంఠంతో అడిగారు స్నేహితురాళ్లు ఇద్దరూ.

'మునగ చెట్టు చాలా పెద్దదిగా ఉంది కదా అని ములక్కాయలు కోయడానికి ఎప్పుడూ చెట్టు ఎక్కకూడదు. ఎందుకంటే ఆ చెట్టు చాలా బలహీనంగా ఉంటుంది. ఒకవేళ తెలియక ఎవరైనా ఎక్కితే పెళ్ళున విరిగి పోతుంది. ఎక్కిన వాళ్ళు దబ్బున కిందకి పడతారు. చూపుకి మాత్రమే మునగ చెట్టు దృఢంగా కనపడుతుంది.

అతిగా ఎవరైనా పొగిడిన సందర్భంలో 'మునగ చెట్టు ఎక్కించకు' అనడంలో ఉద్దేశం అదే పొగడ్తలతో ఉబ్బి తబ్బిబ్బై దబ్బున కింద పడతారని. ఇది ఒక జాతీయం' అని చెప్పింది స్వాతి. 'ఓహెూ అదా సంగతి. ఇప్పుడు అర్థమయ్యింది' అంటూ ఎవరిళ్ళకు వారు దారి తీశారు.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445.

లెక్క చేయండి



పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేయాలి. ట్రై చేయండి చూద్దాం.

జవాబు : 10

నేను గీసిన బొమ్మ





కె.యోగేశ్వర్,
7వ తరగతి,
ఎస్‌కెబిటి ప్రభుత్వ హైస్కూలు,
రాజమహేంద్రవరం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీ పిల్లలతో గడుపుతున్నారా?

పిల్లల పెంపకం ఒక కళ. నేడు మారిన ఆధునిక, సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం నడుమ పిల్లలను పెంచటం చాలా కష్టంగా, క్లిష్టంగా మారింది. తాము ఆశిస్తున్నట్లుగా వారు ప్రవర్తించటం లేదని చాలామంది తల్లిదండ్రులు తరచూ బాధపడుతుంటారు. వారు మంచి పిల్లలు కావాలనీ, చదువుల్లో బాగా రాణించి పదిమందిలో మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటారు. కానీ నిజానికి నేటి పరిస్థితులు, ప్రభావాలు, స్థితిగతులు తల్లిదండ్రుల్ని చాలా గందరగోళ పరుస్తున్నాయి. నేడు పిల్లల పెంపకం గతంలో మాదిరిగా ఉండటం లేదు.



పిల్లల్లో కుతూహలం ఎక్కువగా ఉంటుంది. ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని ఆరాట పడుతుంటారు. అప్పుడు వారి పక్కనుండి సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది. గోడమీద గీతలు గీశాడనో, ఇతరత్రా ఇంకేదో చేశారనో వారిని దండించటం సరికాదు. పద్ధతులు, అలవాట్లకు సంబంధించిన వారి భావాలను, క్రియేటివిటీని స్వేచ్ఛగా వ్యక్తం చేయనివ్వాలి. ఈ రకం తల్లిదండ్రులు తమలోని తీరని కోరికలను తమ పిల్లలపై రుద్దటం, పిల్లల అభిరుచులను, ఇష్టాలను గమనించి ఆ దిశగా ప్రోత్సహించాలన్నది వారి ఉద్దేశ్యం. మరికొందరు తల్లిదండ్రులు ఏ ఆంక్షలూ లేకుండా పిల్లల్ని పెంచాలని భావిస్తారు. ఇది చెయ్యాలి. ఇది చెయ్యకూడదు అని ప్రతిక్షణం వారిపై ఆంక్షలు రుద్దడం, ప్రతి బిడ్డలోనూ వ్యక్తిత్వం ఉంటుందని మరీ ఎక్కువగా నిబంధనలు విధించటం వల్ల వారిలోని వ్యక్తిగత తత్వం, క్రియేటివిటీ నశిస్తాయని వారు విశ్వసిస్తారు. వీరి దృష్టిలో పేరెంటింగ్ అనేది నిరంతర అభ్యాస ప్రక్రియ.

తల్లిదండ్రుల్లో రకాలు

పిల్లల పెంపకం విషయంలో మానసిక శాస్త్రవేత్తలు, పిల్లల నిపుణులు దశాబ్దాల కాలంగా పరిశోధనలు నిర్వహిస్తూనే ఉన్నారు. వాళ్లు ప్రధానంగా పేరెంటిగ్‌లో నాలుగు రకాల పద్ధతుల్ని వివరించారు.

అథారిటేటివ్ : ఈ రకమైన తల్లిదండ్రులు స్టీరింగ్ వీల్‌ను ఎప్పుడూ పిల్లలకే వదిలేస్తారు. కానీ వారి పాదం మాత్రం బ్రేక్‌పైనే ఉంటుంది. ఎప్పుడు అవసరం వచ్చినా తీసుకోవాల్సిన చర్యల గురించి వారే నిర్ణయిస్తారు. తమకు ఏ విధమైన అవసరం వచ్చినా తల్లిదండ్రులు అందుబాటులో ఉంటారని పిల్లలకు తెలుసు. తమ ఛాయిస్‌లకు తామే బాధ్యులు కావాలని పిల్లలకు బోధిస్తారు. ఇక్కడ ప్రేమ, పరిరక్షణ ఉంటాయి. తప్పుల్ని వివరిస్తారు. సాధించిన వాటికి రివార్డులుంటాయి. క్రమశిక్షణా పద్ధతులు అధికార దర్పంతో కంటే మద్దతు ఇచ్చేవిగా ఉంటాయి. ఈ రకం పెంపకం వల్ల పిల్లల్లో సంతోషం, విశ్వాసం, స్పష్టత, పరిపక్వత, విజయతత్వం ఉంటాయి

నియంతృత్వ ధోరణి : ఇక్కడ తల్లిదండ్రులే పూర్తి నిర్ణయకర్తలు. స్టీరింగ్ వీల్, బ్రేకులు, గేరు చివరకు మ్యూజిక్ సిస్టమ్ కూడా వారి చేతుల్లోనే ఉంటుంది. పిల్లలు వారి ఆర్డర్లను పాటించి తీరాలి. ఏమి చేయాలి, ఏమి చేయకూడదు అన్న జాబితాకు కట్టుబడాలి. తప్ప ప్రశ్నలు వేయకూడదు. విధేయత పుష్కలంగా ఉంటాయి. ఈ రకం పెంపకం వల్ల పిల్లల్లో క్రమశిక్షణ, చదువులో ముందంజ ఉండొచ్చు. కానీ ఆత్మస్థైర్యం, సామాజిక పోటీ, స్వతంత్ర ఆలోచనలు కొరవడతాయి. పిల్లల్లో కళాత్మక దృక్పథం నశించే అవకాశం లేకపోలేదు.

అనుమతితత్వం : ఈ పెంపకంలో పర్యవేక్షణ, నిబంధనలు నేర్చుకోకముందే తాళాలు ఇచ్చి వేస్తారు. ఇక్కడ పర్యవేక్షణకు తావులేదు. నిబంధనలు ఉండవు. పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. తల్లిదండ్రులు, పిల్లల మధ్య కమ్యూనికేషన్ ఛానల్స్ అన్నీ తెరిచే ఉంటాయి. వీరి తల్లిదండ్రుల పాత్ర తక్కువగా స్నేహితుల పాత్రలో ఎక్కువగా ఉంటారు. ఈ రకమైన పెంపకం వల్ల వ్యక్తిగత క్రమశిక్షణ కొన్నిసార్లు లోపిస్తుంది. తల్లిదండ్రుల అభిప్రాయాలను సీరియస్‌గా తీసుకోకపోవచ్చు.

పూర్తి స్వేచ్ఛ : పిల్లల ప్రాథమిక అవసరాలు సవ్యంగా తీరుతున్నంత కాలం తల్లిదండ్రులు తమ పాత్రను, బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నట్లే భావిస్తారు. ఈ రకం పెంపకంలో తల్లిదండ్రులు డ్రైవ్ చేస్తే పిల్లలు ఇంట్లోనే ఉండిపోతారు. కొన్ని సార్లు అన్నీ సమకూర్చుతున్నాం అని అనుకుంటూ పిల్లల కోరికలను నిర్లక్ష్యం చేస్తుంటారు. పిల్లలు జీవితంలో ఏ రకంగానూ పాలుపంచుకోరు.

పిల్లలతో గడపాలి

సగటున ఉద్యోగులైన తల్లిదండ్రులు తమ పిల్లలతో రోజుకు రెండు గంటలు కూడా గడపలేకపోతున్నారు. ఈ సమయాన్ని మరికొంత పెంచుకోవాలి. పేరెంటింగ్ ఏ పద్ధతిలో సాగుతున్నదనే సంగతిని పక్కన పెడితే పిల్లలకు పెద్దలతో గడపాల్సిన సమయం అవసరం ఉందని మానసిక నిపుణుల అభిప్రాయం. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను పూర్తిగా స్వచ్ఛమైన వాతావరణంలో పెంచడానికి ప్రయత్నిస్తారు. అన్ని రకాలుగా అంటే స్నేహితులు, ఆహారపు అలవాట్లు, టెలివిజన్, సెల్‌ఫోన్ల కార్యక్రమాలు లేదా వారు చదివే పుస్తకాల విషయంలో సరైన వాతావరణాన్ని సృష్టించాలన్న ఆలోచన లేకపోవటంలో ఈ రకమైన వాతావరణంలో పెరిగిన పిల్లలు అతి ఆతృతతో ఉంటారు.

ఆలోచన, విచక్షణలను చెప్పాలి

పిల్లలు తమ చుట్టూ ఉన్న మనుషులు, పరిసరాలను నమ్మడానికి ఎక్కువ సమయాన్ని తీసుకుంటారు. ఇలాకాక సహజ వాతావరణంలో పెరిగేలా పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాలి. వారి శారీరక, మానసిక ఆరోగ్యాలను ఇనుమడింపజేయగలగాలి. ఆటలు పిల్లల ఎదుగుదలకు చక్కని మార్గం. రక్షణ గురించిన ఆలోచనలు ఇప్పుడు బాగా పెరిగాయి. టెక్నాలజీ ఈ ఆటల సమయాన్ని మింగేస్తుంది. పిల్లల వ్యక్తిగత నియంత్రణ; స్వచ్ఛత, ఆలోచన, విచక్షణల్ని వివరించి చెప్పటం పెద్దలుగా మన బాధ్యత. వారి విజయాన్ని కాంక్షించాలి. విజయం ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. అయితే విజయమే అన్నీ అనుకోకూడదని అనుభవజ్ఞులైన అమ్మానాన్నలు చెబుతుంటారు.

పెంపకంలో సమ బాధ్యత

తండ్రి పోషిస్తే తల్లి సంరక్షణ బాధ్యతలు చూడడం అనేది పాత మాట. ఈ పాత్రల ఈక్వేషన్ ఇప్పుడు మారింది. ప్రస్తుత కాలంలో మన దేశ తండ్రులు కూడా పిల్లలు దైనందిక కార్యకలాపాల్లో తల్లులతోపాటు భాగం పంచుకుంటున్నారు. పిల్లల పెంపకంలో సమ బాధ్యత స్వీకరిస్తున్నారు. తల్లిదండ్రుల నిర్ణయాలు పిల్లల జీవితానికి ఒక ఆకృతిని సమకూరుస్తాయి. మన పేరెంటింగ్ పద్ధతుల్లో గట్టి సాంస్కృతిక ప్రభావం కనిపిస్తుంది. పిల్లల్లో వ్యక్తిగత క్రమశిక్షణ, ఫోకస్ అనేవి చాలా ముఖ్యమైనవి. చిన్న తనం నుంచే పిల్లల్లో ఈ నైపుణ్యాలను జొప్పించగలిగితే వారు హైస్కూలు వయస్సుకు వచ్చే సరికి చక్కని మానసిక వికాసంతో ఉంటారు.



– డాక్టర్ విడియాల చక్రవర్తి,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, 94401 39025

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68